


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 149 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


ప్రతి పాడి రైతుకు సాధికారత కల్పించడమే

## హెరిటేజ్ లక్ష్యం

### నారా భువనేశ్వరి



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రతి పాడి రైతుకు సాధికారత కల్పించడమే హెరిటేజ్ లక్ష్యమని ఆ సంస్థ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి అన్నారు. గత 33 ఏళ్లుగా ప్రతి ఇంటికీ తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులను అందిస్తున్నామని చెప్పారు. రూ.4 కోట్లతో ప్రారంభమై.. రూ.4 వేల కోట్ల సంస్థగా ఎదిగినా.. నాణ్యత విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదని స్పష్టం చేశారు. "ప్రతి ఉత్పత్తికీ 25 నాణ్యతా పరీక్షలు జరిగాకే.. మీ ఇంటికి వస్తుంది. నాణ్యతా ప్రమాణాలను మిగతా .. 2లో..



విశాఖ సముద్ర తీరంలో

# ఘనంగా సిటీ పరేడ్



విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : అంతర్జాతీయ యుద్ధ నౌకల పండగ దినోత్సవంగా విశాఖ బీచ్‌లో సిటీ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నేవీ ఆపరేషన్ డెమో ఆకట్టుకుంది. హెలికాప్టర్లు, యుద్ధవిమానాలు, యుద్ధ నౌకల విన్యాసాలు కనువిందు చేశాయి. మెరైన్ కమాండోల సాహసాలు సందర్శకులను ఔరా అనిపించాయి. మొత్తం 60 నౌకాదళ హెలికాప్టర్లు, విమానాలు గగనతలంలో సందడి చేశాయి. ఈ కార్యక్రమంలో నౌకాదళాధిపతి, వివిధ దేశాల నౌకాదళాధిపతులు, అంతర్జాతీయ ప్రతినిధులు, సాయుధ బలగాల అధికారులు, నావికులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భారత్‌లో మార్పుల వేగానికి

# ఆశ్చర్యపోతున్నా..

### గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్



విశ్వం వాయిస్ న్యూస్ : ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని ప్రశంసించారు. "కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మిగతా .. 2లో..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు

## 34 శాతం రిజర్వేషన్ల కల్పనే లక్ష్యం

### రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే మాజీ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించినట్లు తెలిపారు. గత మిగతా .. 2లో..

## ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు

### రేపు ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనున్న సీఎం పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ కానున్న ముఖ్యమంత్రి



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు హాజరు కానున్నారు. ఏపీని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్నారు. రేపు ఉదయం జైపూర్ నుంచి ఢిల్లీకి చేరుకోనున్న సీఎం భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ సమ్మిట్ వేదికకు వెళ్లనున్నారు. 9.30 గంటలకు ఏఐ యాక్సిలరేటర్స్, ఫ్యూయలింగ్ ఇండియాస్ ఎకనామిక్ గ్రోత్ అనే అంశంపై జరిగే ప్లీనరీ సెషన్‌లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొనున్నారు. అనంతరం రాష్ట్రంలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కల్పనకు సంబంధించిన కొన్ని ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకోనుంది. ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు మిగతా .. 2లో..

రఫేల్‌తో భారత రక్షణ రంగం

## మరింత బలోపేతం

### ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్



విశ్వం వాయిస్ న్యూస్ : భారత్–ఫ్రాన్స్‌ల మధ్య రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు అంశాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్వాగతించారు. ఈ వ్యవహారంపై వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. ఈ యుద్ధ విమానాలు భారత్‌ను బలీయమైన సైనిక శక్తిగా మారుస్తాయని తెలిపారు. అదేవిధంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందిస్తాయని ఓ జాతీయ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. "భారత ప్రభుత్వానికి, దసో ఏవియేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చల్లో రఫేల్ కొనుగోళ్లు ఓ భాగం. దీనిపై ఎందుకు విమర్శలు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఈ డీల్ భారత్‌ను సైనికపరంగా మరింత శక్తిమంతం చేస్తుంది. స్థానికంగా మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇటీవల భారత్– ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలను మిగతా .. 2లో..

మాతో ఒప్పందం

## చేసుకోండి.. లేదంటే..

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



విశ్వం వాయిస్ న్యూస్ : అణు కార్యక్రమానికి సంబంధించి ఇరాన్ తప్పనిసరిగా తమతో ఒప్పందం చేసుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. లేదంటే పరిస్థితులు మరింత దిగజారుతాయని హెచ్చరించారు. ఇప్పటికే పశ్చిమాసియాలో సైన్యాన్ని మోహరిస్తున్నామని, ఒప్పందం చేసుకోలేదంటే దీన్ని మరింత ముందుకు వెళ్తామన్నారు. 'బోర్డ్ ఆఫ్ పీస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మరో 10 రోజుల్లో దాని ఫలితాన్ని మిగతా .. 2లో..

హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి

## వైకాపా పరువు పోగొట్టుకుంది

### బీఆర్ నాయుడు



తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ : కల్తీ నెయ్యి కేసులో పీకల్లోతు కూరుకుపోయిన వైకాపా నేతలు.. హెరిటేజ్‌పై ఆరోపణలు చేయడం దుర్మార్గమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంస్థ ఎప్పుడూ తితిదేకు నెయ్యి సరఫరా చేయలేదని.. ఇది నిప్పులాంటి నిజమని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "ప్రత్యక్షంగా, పరోక్షంగా నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్ర లేదు. అబద్ధాన్ని మిగతా .. 2లో..

## "నన్ను భయపెట్టలేరు.. ప్రజలే నా బలం"

### శిక్షలతో మా పోరాటం ఆగదు : అంబటి రాంబాబు

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : వైఎస్ఆర్సీపీ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్‌పై విడుదలైన అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలు బయట మీడియాతో మాట్లాడారు. తనపై దాడి జరిగిందని, ఇంటిని ధ్వంసం చేశారని, ప్రాణాలు తీసేందుకు కూడా ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. "నన్ను చంపేం దుకు ప్రయత్నించారు. అది కుదరక జైలుకు పంపించారు. అయినా నేను డోంట్ కేర్... నా పక్షాన ప్రజలున్నారు. న్యాయం ఉంది," అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిపక్ష స్వరాన్ని అణగదొక్కే ప్రయ త్నాలు జరుగుతున్నాయని అంబటి రాంబాబు విమర్శించారు.



తనపై నమో దైన కేసులు కక్షసాధింపునకు నిదర్శ నమని అన్నారు. "నన్ను భయపెట్టడం సాధ్యం కాదు. ప్రజల సమస్యలపై నేను మాట్లాడుతూనే ఉంటాను. జైలు శిక్షలతో మా పోరాటం ఆగదు," అని మిగతా .. 2లో..

## 'రాష్ట్రానికి వైకాపా హానికరం'

### ఈ వార్నింగ్ నిరంతరం ఇవ్వాలి : పయ్యావుల



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : గత ప్రభుత్వం ప్రతి శాఖలోనూ బకాయిలు మిగిల్చి వెళ్లిందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. సుమారు రూ.2వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డబ్బుతో చాలా పథకాలు సమర్థంగా అమలు చేయవచ్చని మిగతా .. 2లో..

చీజ్ ప్యాకెట్ చూపించి

## నెయ్యి అంటారా?

### వైసీపీకి కనీస అవగాహన కూడా లేదు మంత్రి అచ్చెన్న తీవ్ర ఆగ్రహం



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : శాసన మండలిలో వైసీపీ సభ్యుల వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రతిష్ఠను దెబ్బతీయాలనే దురుద్దేశంతో వైసీపీ సభ్యులు ఆందోళనలు మిగతా .. 2లో..

హిందూపురంలో అభివృద్ధి పనులకు

## శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ



విశ్వం వాయిస్ న్యూస్ : ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. తొలుత లేపాక్షి మండలం మనేపల్లిలో రూ.2.60 కోట్లతో ఏర్పాటు మిగతా .. 2లో..

అసెంబ్లీకి వచ్చే దమ్ము లేక...

## నాలుగు గోడల మధ్య డ్రామా

### హోం మంత్రి వంగలపూడి అనిత



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక ప్రజా ప్రతినిధిగా అసెంబ్లీకి వచ్చి చర్చించాల్సింది పోయి, ప్రజలను ఎదుర్కోలేక మీడియా వెనుక దాక్కుంటున్నారని ఆమె ఎద్దేవా చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మూడు మిగతా .. 2లో..

ఖర్గే, రాహుల్‌తో ముగిసిన

## కాంగ్రెస్ ముఖ్యనేతల భేటీ



ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం ముగిసింది. సుమారు 2 గంటలపాటు కొనసాగిన భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మిగతా .. 2లో..

చంద్రబాబు సీఎంగా ఉంటే

## తిరుమల బాగుంటుంది

### నటుడు చరణ్‌రాజ్



విశ్వం వాయిస్ న్యూస్ : చంద్రబాబు సీఎంగా ఉంటే తిరుమల బాగుంటుందని నటుడు చరణ్ రాజ్ పేర్కొన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం సంతోషకరమన్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో చరణ్‌రాజ్ శ్రీవారిని దర్శించుకున్నారు. డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, నిర్మాత లోహిత్, నటి రమ్య శ్రీ, తెలంగాణ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మంత్రుల అవినీతి చిట్టా

## బయటపెడతాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల చెంపచెల్లుమనిపించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. "భాజపాను అడ్డుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుమ్మక్కయ్యాయి. మజ్లిస్ కోసమే భాగ్యనగరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మూడు ముక్కలు చేశారు. రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడికి పోయాయి. ఢిల్లీకి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# సాధికారత కల్పించడమే హెరిటేజ్ లక్ష్యం

500 మందికి పైగా నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. మాకు 9 రాష్ట్రాల పరిధిలో 3 లక్షల మంది రైతులు ఉన్నారు. పారదర్శకత, నాణ్యమైన ధర, సమయానికి చెల్లింపు.. ఇవే మా సూత్రాలు" అని భువనేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

# 34 శాతం రిజర్వేషన్ల కల్పనే లక్ష్యం

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికే పరిమితం చేసిందన్నారు. దీనివల్ల బీసీలు ఎన్నో పదవులు కోల్పోయారన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. దీనిలో భాగంగా దీనిలో భాగంగానే మాజీ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించిందన్నారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. నా బీసీలు అంటూ వెనుకబడిన కులాలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కోత విధించి, సమాజంలో సగభాగమైన వెనుకబడి వర్గాల వారిని రాజ్యాధికారానికి దూరం చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆది నుంచి బీసీల పక్షపాతి అని తెలిపారు. బీసీలకు జరిగిన ద్రోహాన్ని గుర్తించి, అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు అందజేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ ను నియమించారన్నారు.

**రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌తో బీసీలకు మేలు**

ఏపీలో ఎస్సీ వర్గీకరణంపై నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా విజయవంతమైన పాత్ర పోషించిందని మంత్రి సవిత తెలిపారు. రాజీవ్ రంజాన్ మిశ్రా సమర్థత గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... ఆయన నేతృత్వంలో డెడికేటెట్ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిషన్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. డెడికేటెట్ కమిషన్ నియామకంపై బీసీ సంఘాలు సైతం హర్షం వ్యక్తంచేశాయి. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కు, మంత్రులు లోకేశ్, సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వైకాపా పరువు పోగొట్టుకుంది

పదే పదే చెబితే నిజమవుతుందనుకోవడం మీ భ్రమ. మండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న బొత్స సత్యనారాయణ అన్ని విషయాలు తెలుసుకుని మాట్లాడాలి. హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అని చెప్పి పరువు పోగొట్టుకున్నారు. జగన్ చెప్పినట్లు ఆడకుండా మాట్లాడే ముందు విజ్ఞతతో వ్యవహరించండి. నెయ్యి ధరలపైనా వైకాపా నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఓపెన్ టెండర్లలో పారదర్శకంగా వీటిని నిర్ణయించాం. మా పాలకవర్గం రాగానే మొదటగా మేం స్వామి వారి అన్న ప్రసాదాల నాణ్యతలో రాజీపడకూదని నిర్ణయించుకున్నాం. తక్కువ ధరలకు సరకులు కొని స్వామి వారికి నాణ్యత లేని నైవేద్యాలు, భక్తులకు అన్న ప్రసాదాలు అందించడమేంటి?ఈ విషయంలో మేం రాజీపడే ప్రసక్తే లేదు. నెయ్యి ఒక్కటే కాదు అన్ని రకాల పదార్థాల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పెంచాం. స్వామివారికి సమర్పించే వాటిలో డబ్బు ఎంత ఖర్చు అవుతుందని లెక్కలు వేసుకోం. ఇదంతా ఆయన సొమ్మే. దేవదేవుని సొమ్మును నైవేద్యాలకు, అన్న ప్రసాదాలకు వాడే అంశంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడేది లేదు" అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

# శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ

చేయనున్న బీటీ రోడ్డుకుబాలకృష్ణ భూమి పూజ చేశారు. స్వయంగా ప్రొక్లెయిన్ ఆపరేట్ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మండలంలోని పులమతి చెరువులో పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. ఇటీవల హంద్రీనీవా నీటితో నియోజకవర్గంలోని చెరువులను నింపిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు చెప్పారు.

# భారత్‌లో మార్పుల వేగానికి ఆశ్చర్యపోతున్నా..

మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది" అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు.

**ఏ దేశానికీ సాధ్యం కానిది భారత్ చేసింది: మెక్రాన్**

"డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకుసాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారు" అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు.

**ఏఐ వాస్తవం: చంద్రశేఖరన్**

"ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోంది. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనది" అని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు.

**భారత్‌ది కీలక పాత్ర: దారియో**

"గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుంది" అని ఆంత్రోపిక్ సీఈఓ దారియో అమోడెయ్ పేర్కొన్నారు.

# ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు

కల్పించేలా ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. క్వాంటంతో పాటు ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతోనూ ఒప్పందం జరుగనుంది. ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ తోనూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ఏర్పాటు కోసం ఐఐటీ మద్రాస్ కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన చేయనున్నారు. అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాంధీతోనూ ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ కార్యక్రమంలో పాల్గోనున్నారు. కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అనే అంశంపై నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సదస్సులో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండే తో కలిసి ముఖ్యమంత్రి చర్చించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యునైటెడ్ కింగ్ డమ్ కు చెందిన ప్రతినిధి బృందంతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ కానున్నారు. బ్రిటన్ ఏఐ, ఆన్ లైన్ సేఫ్టీ విభాగం మంత్రి కనిష్క నారాయణ్, భారత్ లో యూకే హై కమిషనర్ లిండి కెమరాన్, వాతావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ కౌన్సెలర్ శాలీ టేలర్ తదితరులతో ముఖ్యమంత్రి సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అరామ్కో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ అయితుకైర్, అడోబ్ సీఈఓ శాంతనూ నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే తో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశం కానున్నారు. అనంతరం ఢిల్లీ నుంచి బయల్దేరి రానున్నారు.

**ఇవాళ జైపూర్‌కు వెళ్లనున్న సీఎం**

కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి హాజరయ్యేందుకు ఇవాళ సాయంత్రం సీఎం జైపూర్ కు బయల్దేరి వెళ్లనున్నారు. సాయంత్రం 5 గంటలకు విజయవాడ నుంచి జైపూర్ కు బయలుదేరనున్నారు. జైపూర్ లోని వృందావన్ ప్యాలెస్ లో జరిగే వివాహానికి హాజరై రాత్రికి అక్కడే బస చేయనున్నారు. రేపు ఉదయం జైపూర్ నుంచి బయల్దేరి ఢిల్లీలో జరిగే ఇండియా ఇంపాక్ట్ ఏఐ సదస్సుకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు.

# మరింత బలోపేతం

'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచాలని నిర్ణయించాం. ఇందులో రఫేల్ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుంది" అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 'రక్షణ కొనుగోళ్ల మండలి' (డీఏసీ) ఇటీవల ఆమోదముద్ర వేసింది. ఈ ఫైటర్ జెట్‌ల తయారీలో 'మేక్ ఇన్ ఇండియా' పరికరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్‌నాథ్ సింగ్ ఫ్రాన్స్‌ను కోరారు. దీనిపై మెక్రాన్ మాట్లాడుతూ.. రక్షణ ఉత్పత్తుల్లో గరిష్ఠ సంఖ్యలో భారతీయ విడిభాగాలు వాడేందుకు, కీలక పరికరాలను భారత్‌లో తయారు చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

# చేసుకోండి.. లేదంటే..

మీరే చూస్తారని ఇరాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.భారత్-పాక్‌ల మధ్య సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో తన కృషి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. ఘర్షణలు ఉద్ధృతంగా కొనసాగుతున్న వేళ ఇరు దేశాధినేతలతో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించుకోకపోతే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనని వారికి స్పష్టం చేశానని, 200శాతం సుంకాలు విధిస్తానంటూ బెదిరించినట్లు తెలిపారు. ఈ యుద్ధం ఆపడం ద్వారా 2.5కోట్ల మంది ప్రాణాలను రక్షించారని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనతో చెప్పారని అన్నారు. ప్రధాని మోదీ బాగా తెలుసునని, ఆయన గొప్ప వ్యక్తి అని ట్రంప్ పేర్కొన్నారు.

**గాజా పునరుద్ధరణకు..**

గాజా పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని, ఇందుకు తొమ్మిది సభ్య దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇందుకోసం 7 బిలియన్ డాలర్లు (రూ.63వేల కోట్ల) ప్యాకేజీ ఇచ్చేందుకు నిబద్ధతతో ఉన్నామన్నారు. అమెరికా కూడా బోర్డ్ ఆఫ్ పీస్‌కు 10బి. డాలర్లు ఇస్తుందని హామీ ఇచ్చారు. అయితే, అది ఎందుకోసం ఖర్చుపెడతారనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

# "నన్ను భయపెట్టలేరు.. ప్రజలే నా బలం"

స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై ఆయన ఘాటు సెటైర్లు వేశారు. "ప్రజా స్వామ్యంలో విమర్శించడం నేరమా? తప్పు లను ఎత్తిచూపితే జైలుకి పంపిస్తారా?" అంటూ ప్రశ్నించారు. ప్రజల మద్దతుతోనే తాను ముందుకు సాగుతానని, అన్యాయానికి వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అంబటి రాంబాబు విడుదలవుతున్న సమయంలో ఆయన అనుచరులు జైలు బయట పెద్ద సంఖ్యలో చేరుకుని స్వాగతం పలికారు. నినాదాలతో వాతావరణం హోరెత్తింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నాపై ఎంత ఒత్తిడి తెచ్చినా వెనక్కి తగ్గను. ప్రజల విశ్వాసమే నాకు ధైర్యం," అని పేర్కొన్నారు. ఇక తనపై జరిగిన దాడులు, కేసుల విషయమై న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తానని, నిజం చివరకు గెలుస్తుందని అంబటి రాంబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల్, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'రాష్ట్రానికి వైకాపా హానికరం'

తెలిపారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. "గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగింది. గతంలో ఆ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లింది. వైకాపా హయాంలో తెలుగుజాతి ఎన్ని కష్టాలు పడిందో చూశాం. రాష్ట్రానికి ఆ పార్టీ హానికరమనే వార్నింగ్‌ను నిరంతరం ఇస్తూనే ఉండాలి. వైకాపా నెవర్ ఎగైన్.. వన్స్ ఎగైన్ కూటమి" అని పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను కూడా గత పాలకులు పట్టించుకోలేదని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న జిల్లాల వారీ సమీక్షల్లో భాగంగా పులివెందుల నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆయన అన్నారు. పులివెందుల సమస్యలను గత పాలకులు గాలికి వదిలేస్తే.. కూటమి ప్రభుత్వం పరిష్కారానికి ప్రయత్నిస్తోందని చెప్పారు. మల్లెల గ్రామంలో మహాత్మా జ్యోతిబాపులే ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్) బాలికల పాఠశాల నిర్మాణం కోసం రూ.19.62 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బనానా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ హౌస్ నిర్మాణాన్ని గాలికి వదిలేశారని.. దానిని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని చెప్పారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర నీటిసరఫరా పథకం నిర్మాణం పూర్తి చేయలేదని విమర్శించారు. వేంపల్లి నుంచి గండి వరకు రోడ్ విస్తరణ, కాలేటి వాగు రిజర్వాయర్ తదితర పనులను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని మంత్రి వివరించారు.

# చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటారా?

చేపడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్‌కు ఎక్కడా ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా స్పష్టంగా సమాధానం ఇచ్చినప్పటికీ, అదే అంశాన్ని మళ్లీ మళ్లీ తీసుకొచ్చి సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు.

**ఆధారాలుంటే చూపండి...లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలి**

ఇందాపూర్‌కు హెరిటేజ్‌కు సంబంధం ఉందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు, ఒక్క చిన్న ఆధారం అయినా చూపించాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. కానీ ఆధారాలు చూపకపోగా, బయట ప్రెస్‌మీట్లు పెట్టి చీజ్ ప్యాకెట్లు చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చీజ్,నెయ్యి మధ్య తేడా కూడా తెలియకుండా వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఈ తప్పుడు ప్రచారంపై హెరిటేజ్ సంస్థ బొత్సకు లీగల్ నోటీసులు ఇచ్చిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆధారాలుంటే చర్చిద్దాం, లేకపోతే అసత్య ప్రచారాన్ని ఆపాలని హెచ్చరించారు.

**ప్రభుత్వాల పేరుతో వ్యాపారాలు కాదు....హెరిటేజ్ చారిత్రాత్మక నిర్ణయం**

హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని వ్యాపార లావాదేవీలు జరపకూడదని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వాల పేరుతో డబ్బులు దోచుకునే సంస్కృతి హెరిటేజ్‌ది కాదని, గతంలో ప్రభుత్వ ధనాన్ని భారతి సిమెంట్ పేరుతో దోచుకున్న చరిత్ర వైసీపీకి మాత్రమే ఉందని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నేతల చర్యలు ఫ్యాక్షన్ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని, గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్‌ను ఎలా అరికట్టామో అలాగే ఇప్పుడు కూడా ప్రజల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే ప్రయత్నాలను సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. చీని తోటలు కట్ చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి పాత పద్ధతులే ఇప్పుడు సంస్థలపై బదనాం చేయడంగా మారాయని మండిపడ్డారు.

**సభను ఇబ్బందికి గురిచేయడం సరికాదు**

శాసనమండలిలో ప్రతిరోజూ ఒకే అంశాన్ని తీసుకొచ్చి వాయిదా తీర్మానాలతో సభను ఇబ్బందికి గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి హెచ్చరించారు. ఆధారాలుంటే టేబుల్‌పై పెట్టండి, లేదంటే అసత్య ప్రచారం మానేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ముఖ్యనేతల భేటీ

పలువురు మంత్రులు పాల్గొన్నారు. భేటీ అనంతరం ఖర్గే 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం"అని ఖర్గే పేర్కొన్నారు.

# మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం

మూటలు పంపేందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా బయటపెడతాం. అవినీతికి సంబంధించిన ఆడియో రికార్డులు మా వద్ద ఉన్నాయి. 2029లో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉండదు" అని బండి సంజయ్ అన్నారు.

# నాలుగు గోడల మధ్య డ్రామా

గంటల పాటు ఏకబిగిన అబద్ధాలు చెప్పడంలో జగన్ మోహన్ రెడ్డి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించవచ్చు. తన సొంత బ్లూ మీడియా (సాక్షి) లో పదే పదే అబద్ధాలు చూపిస్తే అవి నిజం అయిపోతాయనుకోవడం ఆయన అమాయకత్వం. పోలీసు పరిభాషలో చెప్పాలంటే ఆయనొక 'హ్యాబిచువల్ అఫెండర్' (అలవాటుగా నేరాలు చేసే వ్యక్తి) అని అర్థం. "35 ఏళ్లుగా ఎటువంటి మచ్చా లేకుండా నడుస్తున్న హెరిటేజ్ సంస్థపై జగన్ తన అక్కసును వెళ్లగక్కుతున్నారు. తిరుమల లడ్డు కల్తీ అన్న మహాపాపం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు కూడా హెరిటేజ్ పై అసత్య ఆరోపణలు తొలగించాలని ఆదేశించిందన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. "హెరిటేజ్ కన్నా రెట్టింపు పాలు సేకరించే ఇందాపూర్ డైరీని హెరిటేజ్ యూనిట్ అని జగన్ అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం. హెరిటేజ్ ఎప్పుడూ ట్యాంకర్లతో నెయ్యిని సప్లై చేయదు, కేవలం కన్స్యూమర్ మార్కెటింగ్ మాత్రమే చేస్తుంది. ఇందాపూర్ నుంచి హెరిటేజ్ కేవలం చీజ్, పన్నీర్ వంటివి మాత్రమే కొనుగోలు చేస్తుంది తప్ప, నెయ్యి సరఫరాలో ఎటువంటి సంబంధం లేదు. "2015లో నెయ్యి ధరకి, ఇప్పటి ధరకి తేడా ఏంటని జగన్ ప్రశ్నిస్తున్నారు. భారతీ రెడ్డి గారిని అడగండి.. సాక్షి పేపర్ ధర అప్పట్లో ఎంత? ఇప్పుడు ఎంత? భారతీ సిమెంట్ ధర అప్పుడు ఎంత? ఇప్పుడు ఎంత? 2015లో పాల ప్యాకెట్ ధర ?19 ఉంటే, ఇప్పుడు ?40 ఉంది. పాలు ధర పెరిగినప్పుడు నెయ్యి ధర పెరగదా? పాలే లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే సొంతం." "బోలే బాబా మిల్క్ ఫుడ్ ఇండస్ట్రీస్ వేరు, స్కామ్‌లో ఉన్న బోలే బాబా ఆర్గానిక్ మిల్క్ లిమిటెడ్ వేరు. కనీసం రిజిస్ట్రేషన్ నెంబర్లు, కంపెనీ స్థాపించిన సంవత్సరాలు (జ×టీ, టీ×జ కోడ్స్) చూసుకోకుండా బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. జగన్ రెడ్డికి 'మొహానికి మసి అంటుకుంటే అద్దాన్ని తుడుచుకుంటున్నారు' కానీ తన ముఖాన్ని తుడుచుకోవడం లేదు. ఆరు నెలలు సావాసం చేస్తే వీళ్లు వాళ్లవుతారన్నట్టు.. జగన్ రెడ్డి దగ్గర ఉండి బొత్స గారు కూడా అలాగే తయారయ్యారు. మీడియా ముందు చీజ్ ప్యాకెట్ చూపిస్తూ అది నెయ్యి అని చెప్పడం చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావట్లేదు. కనీసం ఆ రెండింటికీ తేడా తెలియని స్థితిలో ఉన్నారా?" అని ప్రశ్నించారు. బోలే బాబా పేరుతో ఉన్న రెండు కంపెనీలను ఒకటిగా చూపించి జగన్ మైండ్ గేమ్ ఆడుతున్నారు. బోలే బాబా మిల్క్ ఫుడ్ ఇండస్ట్రీస్ ఇది 2004లో స్థాపించబడింది. ఇది ఎప్పుడూ ఋణకి నెయ్యి సరఫరా చేయలేదు. బోలే బాబా ఆర్గానిక్ మిల్క్ లిమిటెడ్ ఇది 2020లో (వైసీపీ హయాంలో) స్థాపించబడింది. స్కామ్‌లో ఉన్నది, CBI చార్జ్ షీట్‌లో నిందితుడిగా ఉన్నది ఈ కంపెనీయే. జగన్ గారు.. కంపెనీల పేర్లు ఒకేలా ఉంటే అన్నీ ఒకటే అయిపోవు. హెరిటేజ్ ఏ ఊరిలో ఉన్నా దాని జజూా, డైరెక్టర్లు ఒకటే ఉంటారు. కానీ ఈ బోలే బాబా కంపెనీల రిజిస్ట్రేషన్ నెంబర్లు, NIC కోడ్‌లు, చివరకు యజమానులు కూడా వేరు. స్కామ్ చేసిన వారు జైన్ అయితే, సరఫరా చేయని వారు అగర్వాల్స్ . ఐదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి ఈ చిన్న లాజిక్, CIN నెంబర్లు చూడటం తెలియకపోవడం విచారకరం. ఏదో వెంకటేశ్వర అని పేరు ఉంటే రాష్ట్రంలో ఉన్న వెంకటేశ్వర కంపెనీలన్నీ ఒకటేనా? సూట్ కేస్ కంపెనీలు నడిపే మీకు, సిస్టమాటిక్‌గా వ్యాపారం చేసే కంపెనీల విలువల గురించి ఏం తెలుస్తుంది? కేవలం ప్రజల దృష్టి మళ్లించడానికి నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. మీరు ఏవో కాగితాలు పట్టుకుని ఆధారాలు అని గొప్పలు చెప్పుకున్నారు కదా.. అందుకే మేము ఈ క్లారిటీ ఇస్తున్నాం. నిజంగా మీకు దమ్ముంటే చర్చకు రండి, మీ అజ్ఞానాన్ని ప్రజల ముందు ఉంచుతాం. తిరుమల లడ్డులో రసాయనాల ముద్ద కలిసింది నిజం అని సిట్ రిపోర్ట్, ఎన్.డి.డి.బి రిపోర్ట్ తేల్చి చెప్పాయి. సాక్షాత్తు మీ బాబాయి వై.వి. సుబ్బారెడ్డి గారే మీ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందని ఒప్పుకున్నారు. మరి కల్తీ జరిగిందని తెలిసినప్పుడు ఆ టెండర్లను ఎందుకు రద్దు చేయలేదు? టెండర్ నిబంధనలను ఎందుకు నీరుగార్చారు?" అని హోంమంత్రి ప్రశ్నించారు. నెయ్యి కావాలంటే పాలు ఉండాలి జగన్ రెడ్డి గారు! కానీ మీరు పాలు ప్రొక్యూర్మెంట్ అవసరం లేదనేలా టెండర్ కండిషన్లు మార్చేశారు. రూ. 250 కోట్ల టర్నోవర్ ఉండాలనే నిబంధనను రూ. 150 కోట్లకు ఎందుకు తగ్గించారు? మీ అనుకూల కంపెనీలకు దోచిపెట్టడానికే ఈ మార్పులు చేశారని స్పష్టంగా అర్థమవుతోంది. కల్తీ గురించి మాట్లాడమంటే.. హెరిటేజ్, ఇందాపూర్ అంటూ సంబంధం లేని విషయాలను లాగుతున్నారు. జగన్ రెడ్డి గారు.. ఆధారాలు లేవని పదే పదే అబద్ధాలు ఆడుతున్నారు. దమ్మంటే ఒకసారి SIT రిపోర్ట్ చదవండి. అది ఇంగ్లీష్‌లో ఉంటే ఎవరినైనా అడిగి తెలుగులో ట్రాన్స్‌లేట్ చేయించుకోండి. ?250 కోట్ల స్కామ్ జరిగిందని, రసాయనాల ముద్ద లడ్డులో కలిసిందని రిపోర్టులు క్లియర్ గా చెబుతున్నాయి. మీ బాబాయ్ వై.వి. సుబ్బారెడ్డి గారే కల్తీ జరిగిందని ఒప్పుకున్నాక కూడా మీకు ఇంకేం ఆధారాలు కావాలి? ప్రపంచం గర్వించే బిల్ గేట్స్ మన రాష్ట్రానికి వస్తే అది మనందరికీ గర్వకారణం. కానీ మీ గ్యాంగ్ ఆ స్థాయిని మరిచిపోయి ఆయన తాగిన టీ ఖర్చు, తిన్న బిస్కట్ ఖర్చు గురించి మాట్లాడుతోంది. మీ స్థాయి ఏంటో అక్కడే అర్థమైపోయింది. టెర్రరిజాన్ని అరికట్టవచ్చు కానీ, మీలాంటి 'కల్తీ టెర్రరిస్టులను' అరికట్టడం ప్రజలకే సాధ్యం. నారా లోకేష్ తన సొంత డబ్బులతో ఫ్లైట్ టికెట్ కొనుక్కుని, తన సొంత ఖర్చులతో క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్తే మీకెందుకు అంత జలసీ? ఆయన నిన్న మ్యాచ్ చూసి, ఆ రోజు ఉదయాన్నే బిల్ గేట్స్ గారిని రిసీవ్ చేసుకుని, ఆయనతో కలిసి ఇన్నోవేషన్స్ గురించి చర్చించారు. యువ నాయకుడిగా ఆయన ఎదుగుతుంటే చూసి నేర్చుకోండి తప్ప, ఇలా బురద చల్లకండి. లోకేష్ గారికి క్రీడా స్ఫూర్తి ఉంది కాబట్టే.. వరల్డ్ కప్ సాధించిన మహిళా క్రికెటర్లను ఇంటికి పిలిచి, 2 కోట్ల నగదు, ఇంటి స్థలం, గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చి సత్కరించాం. మీరు జనాలు ఓడగొడితే ఇంట్లో కూర్చుని టీవీలో మ్యాచ్ చూస్తున్నారు, ఆయన జనాలు గెలిపిస్తే బయటకి వెళ్లి ప్రజల కోసం పని చేస్తూ సరదాగా మ్యాచ్ చూస్తున్నారు. ఆ తేడా గమనించండి. తప్పులు చేసిన వాళ్లు తమ మీద ఉన్న బురదని పది మందికి అంటించాలని చూస్తారు. జగన్ రెడ్డి గారు కూడా అదే చేస్తున్నారు. మీరు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ధర్మం ఎప్పుడూ గెలుస్తుంది, మీ 'హ్యాబిచువల్ క్రిమినల్' మెంటాలిటీకి ప్రజలే బుద్ధి చెబుతారు. మేము చర్చకు సిద్ధమని మూడు రోజులుగా మొత్తుకుంటున్నాం. మీ వాళ్లు కౌన్సిల్‌లో గొడవ చేసి బయటికి వచ్చి చర్చకు అవకాశం ఇవ్వడం లేదని డ్రామాలు ఆడుతున్నారు. అక్కడ కూర్చున్న చైర్మన్ మీ పార్టీ వ్యక్తి కాదా? మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, సభకు వచ్చి మాట్లాడండి. ఆధారాలు లేకుండా థంబ్‌నైల్స్ రాజకీయాలు చేయడం మానుకోండి. మా పాలన ఎలా ఉందో ప్రజలను అడగండి. తల్లికి వందనం అందుతున్న తల్లులను అడగండి. దీపం పథకం కింద సిలిండర్లు పొందుతున్న గృహిణులను అడగండి. 16,000 DSC పోస్టులు, 5,700 కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన యువతను అడగండి. దేశంలోనే అత్యధికంగా ?4,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. ఆదివారం వచ్చినా సరే ముందు రోజే పెన్షన్ అవ్వతాతల చేతిలో పెడుతున్న ప్రభుత్వం మాది. "జగన్ గారు మూడు గంటలు మాట్లాడినా అందులో ఒక్కటంటే ఒక్క నిజం కూడా లేదు. తప్పులు చేసి ఇతరులపై నెట్టేసే మీ 'హ్యాబిచువల్ క్రిమినల్' బుద్ధిని ప్రజలు గమనిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు మళ్ళీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. అది మాకంటే మీకు బాగా తెలుసు కాబట్టే ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ధర్మం ఎప్పుడూ గెలుస్తుందని, తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారు శిక్ష అనుభవించక తప్పదని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## పెద్దల సభ చిన్నబోయేలా..
## వైసీపీ సభ్యులు హంగామా

ఏపీ శాసన మండలిలో వైసీపీ సభ్యులు చేసిన హంగామా... సభా మర్యాదను మంటగలిపేలా చేసింది. పెద్దల సభ చిన్నబోయేలా వైసీపీ మండలి సభ్యులు వ్యవహరించిన తీరు.. తీవ్ర ఆవేదన, ఆందోళనకు కూడా దారి తీసింది. గురువారం మండలి ప్రారంభం కాగానే.. చైర్మన్ మోషేన్ రాజు జీరో అవర్ ప్రారంభించారు. ఈ సమయంలో వైసీపీ సభ్యులు తమ తమ స్థానాల్లో నిలబడి.. హెరిటేజ్ వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఇందాపూర్ డెయిరీ-హెరిటేజ్‌కు మధ్య ఉన్న సంబంధంపై తొలుత చర్చించాలని పట్టుబట్టారు. దీనికి సంబంధించి వాయిదా తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని కోరారు. దీనికి చైర్మన్ నిరాకరించారు. తీర్మాన ప్రతు లను తోసిపుచ్చుతున్నట్టు ప్రకటించారు. దీంతో వైసీపీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. సభలో యాగీ చేశారు. దీనిని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు.

పెద్దల సభను సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. అయినప్పటికీ.. వైసీపీ సభ్యులు శాంతించక పోగా.. చైర్మన్ పోడియంను చుట్టుముట్టి అరుపులు.. కేకలతో దద్దరిల్లేలా చేశారు. ఇదే సమయంలో పలువురు సభ్యులు బయట నుంచి ముందే తెచ్చుకున్న చిన్నపిల్లలు ఊదే విజిల్స్‌తో నానా హంగామా చేశారు. ఈ వ్యవహారంపై చైర్మన్ మోషేన్ రాజు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికార పార్టీ సభ్యులు స్పందిస్తూ.. పెద్ద సభను చిన్నబోయేలా చేశారని మండిపడ్డారు. వైసీపీ సభ్యులను సభ నుంచి బహిష్కరించాలని టీడీపీ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. అనంతరం.. వైసీపీ సభ్యులు సభ నుంచి బయటకు వచ్చారు. ఇదిలావుంటే.. అసలు వైసీపీ సభ్యులు సభలోకి



విజిల్స్ ఎలా తీసుకువచ్చారన్న విషయంపై చైర్మన్ భద్రతా సిబ్బందిని ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఇకనుంచి ఇలాంటి జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఊయలే ఉరితాడై.. బాలిక మృతి



మార్కాపురం, విశ్వం వాయిస్ న్యూస్ : చీరతో కట్టిన ఊయల మెడకు బిగుసుకోవడంతో బాలిక మృత్యువాత పడిన ఘటన మార్కాపురం పట్టణంలో చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ జయకుమార్, భార్య వెంకటమ్మలు పట్టణ శివారు ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి సునంద భాగ్యలక్ష్మి (7), ఓ బాబు (4) ఉన్నారు. మంగళవారం రాత్రి బాలిక సునంద భాగ్యలక్ష్మి ఆడుకుంటూ.. ఇంటి వరండాలో చీరతో కట్టిన ఊయల వద్దకు వెళ్లి, అందులో తల పెట్టి ఆడుకోసాగింది. ఈ క్రమంలో చీర మెడకు బిగుసుకుపోయి.. బాలిక అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్రమత్తమైన తల్లి, బంధువులు పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పాప మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

## జీవితం భారమైందని భార్యను కడతేర్చాడు

### మానసిక సమస్యలతో ఇస్రో విశ్రాంత ఉద్యోగి దారుణం



బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ : మానసిక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఇస్రో మాజీ ఉద్యోగి నాగేశ్వరరావు తన భార్య సంధ్యాశ్రీ (60)ని దారుణంగా హతమార్చాడు. విజయవాడకు చెందిన నాగేశ్వరరావు ఉద్యోగ నిమిత్తం కొన్నేళ్ల కిందటే బెంగళూరుకు వచ్చాడు. ఆవలహళ్లి సమీపంలోని బొమ్మనహళ్లిలో స్థిరపడ్డారు. దంపతులిద్దరు స్థానిక వర్చుసో అపార్ట్‌మెంట్‌లో ఉంటుండగా వీరి ఏకైక కుమార్తె విదేశాల్లో ఉంటోంది. కొద్ది రోజుల కిందటి నుంచి నాగేశ్వరరావుకు మానసిక సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలోనే జీవితం భారమైందని ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కానీ, తను చనిపోతే భార్య ఒంటరి అవుతుందని భావించి బుధవారం ఉదయం ఆమె ముఖంపై దిండు పెట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఆ తర్వాత తనూ ఉరేసుకోవాలనుకొని.. భయపడి ఆగిపోయినట్లు బెంగళూరు వైట్‌ఫీల్డ్ విభాగం డీసీపీ సైదులు అడావత్ తెలిపారు. ఆవలహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## విడాకులు ఇవ్వలేదనే కక్షతో భార్యను చంపి..

### ఆపై ఆత్మహత్యాయత్నం

బిక్కవోలు, విశ్వం వాయిస్ న్యూస్ : విడాకులు ఇవ్వడం లేదనే కక్షతో భార్యను హతమార్చి.. ఆపై భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన దొనకొండ దుర్గయ్య, జ్యోతి (28) భార్యాభర్తలు. మనస్పర్థలతో గత ఐదేళ్లుగా వీరిద్దరూ అదే గ్రామంలో వేర్వేరుగా ఉంటున్నారు. పెద్దాపురంలోని ఓ రొయ్యల పరిశ్రమలో జ్యోతి పనిచేస్తోంది. వీరి గొడవలపై పలుమార్లు గ్రామంలో, పోలీసుల వద్ద పంచాయితీ జరిగింది. తనతో కలిసి ఉండాలని.. లేదంటే విడాకులు ఇవ్వాలని గత కొన్నిరోజులుగా దుర్గయ్య కోరుతున్నాడు. ఈ క్రమంలో పెద్దాపురంలో రొయ్యల పరిశ్రమకు వెళ్లిన జ్యోతి.. సంస్థకు చెందిన బస్సులో బుధవారం రాత్రి రంగాపురంలో దిగింది. అదే సమయంలో అక్కడ ఉన్న దుర్గయ్య ఆమె తలపై బలంగా దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలతో జ్యోతి మృతిచెందింది. ఆపై దుర్గయ్య కూడా పురుగుల మందు తాగి ఇంటికివెళ్లాడు. కుటుంబసభ్యులు గమనించి అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

### బాలికకు గంజాయి తాగించి..

## ఆపై ముగ్గురు రౌడీషీటర్ల అత్యాచారం



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : నగరంలోని నార్సింగి పీఎస్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. బాలికకు గంజాయి తాగించి మత్తులో ఉండగా ముగ్గురు రౌడీషీటర్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలికి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. నిందితులు ముగ్గురూ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## మూడేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం..

### పోలీసుల అదుపులో నిందితుడు



విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : విశాఖ జిల్లాలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై యోగి అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పెదగంట్యాడ మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తినుబండారాలు ఇస్తానని చెప్పిన కామాంధుడు చిన్నారిని తీసుకెళ్లాడు. అనంతరం బాలిక ఏడుస్తుండటంతో తల్లి గమనించింది. దీంతో తల్లిదండ్రులు న్యూపోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం**

ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విశాఖపట్నం సీపీతో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటివి సమాజానికి మచ్చగా నిలుస్తాయన్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. నిందితుడికి కఠినశిక్ష పడేలా మహిళా కమిషన్ పర్యవేక్షిస్తుందని శైలజ తెలిపారు.

### ఉన్నత విద్య కోసం వెళ్లి..

## ఊపిరి తీసుకున్న ఎన్ఐటీ విద్యార్థి



మహేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ : కుమారుడు ఉన్నత చదువులు చదివి..తమ జీవితాన్ని మారుస్తాడని ఆ తల్లిదండ్రులు ఎంతో ఆశపడ్డారు. కానీ, ఊపిరి తీసుకుని కన్నవారికి కన్నీటిని మిగిల్చాడు ఆ యువకుడు. ఉన్నత విద్య కోసం హరియాణా వెళ్లిన ఓ విద్యార్థి హాస్టల్ గదిలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కాట్రావత్ తండాకు చెందిన అంగోత్ చందూనాయక్, శారద దంపతులకు వ్యవసాయమే జీవనాధారం. వీరి పెద్ద కుమారుడు అంగోత్ శివ(19) హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 16న ఉదయం తరగతులకు హాజరైన శివ.. మధ్యాహ్నం హాస్టల్ గదికి వెళ్లాడు. మిగతా వారితో కలిసి భోజనానికి వెళ్లకుండా గదిలోనే ఉండిపోయాడు. అనంతరం విద్యార్థులు వెళ్లి చూడగా ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. శివ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, మృతిపై హరియాణా ప్రభుత్వం విచారణ చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపాలని తండా వాసులు కోరారు. శివ మృతి పట్ల ఆ రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# విద్యా వాయిస్

## విదేశీ వర్సిటీల్లో.. ఉచితంగా నేర్చుకుందాం..



విదేశాలకు వెళ్లి చదవాలనీ, నాణ్యమైన విద్యా బోధనను అందుకోవాలనీ చాలామంది విద్యార్థులు అనుకుంటారు. కానీ రకరకాలైన కారణాల వల్ల వెళ్లలేకపోతుంటారు. ఫీజు ఎక్కువనే భయం ఉండనే ఉంది. కానీ అక్కడికి వెళ్లకుండానే ఆ యూనివర్సిటీల్లో చదివే అవకాశం ఉందని చాలా మందికి తెలియదు. ఆన్‌లైన్ ద్వారా ఈ సంస్థల్లో వివిధ కోర్సులు చేయవచ్చు. ఆ వివరాలేంటో చూద్దామా! ప్రఖ్యాతిగాంచిన విదేశీ యూనివర్సిటీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరి కోసం కొన్ని ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి వారి విద్యాసంస్థల్లో ప్రమాణాల స్థాయిని పరిచయం చేయడమే కాకుండా... విద్యార్థులు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేందుకు పనికొస్తాయి. ఇటువంటి కోర్సుల్లో చేరిన విద్యార్థులు తమకు నచ్చిన విభాగాల్లో ప్రాథమికాంశాలు ఉచితంగా నేర్చుకోవచ్చు. అంతేకాదు, విదేశీ విశ్వవిద్యాలయం నుంచి చదివామన్న తృప్తీ లభిస్తుంది, జాబ్ మార్కెట్‌లో మంచి అవకాశాలూ అందుకోవచ్చు. ఇవి అధికశాతం ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అనుసంధానమై పనిచేస్తున్నాయి. అంటే సంబంధిత వర్సిటీ అధ్యాపకులే ఈ ప్లాట్‌ఫామ్స్ ద్వారా బోధిస్తారన్నమాట.

**హార్వర్డ్ యూనివర్సిటీ**

ఐవీ లీగ్‌లో ముఖ్యమైన, పురాతనమైన వర్సిటీ ఇది. దాదాపు 600లకు పైగా కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తోంది. ఉన్నత స్థాయి ప్రమాణాలతో, తమ విద్యాబోధన ఎలా ఉంటుందనే విషయం తెలిసేలా ఈ కోర్సులు ఉంటాయి. ఇవి ఒకటి నుంచి పన్నెండు వారాల వ్యవధితో లభిస్తాయి. సాహిత్యం, లా, బిగ్‌డేటా, సామాజిక అంశాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, ప్రోగ్రామింగ్, గేమ్ డెవలప్‌మెంట్, చరిత్ర, న్యూరోసైన్స్.. ఇలా విభిన్న అంశాలను నేర్చుకునే వీలుంది. ఇవేకాక ఆధునిక సాంకేతిక కోర్సులైన మెషిన్ లెర్నింగ్, పైతాన్ లాంగ్వేజ్, గేమ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్ వంటి వాటిలోనూ ప్రాథమిక అంశాలు నేర్చుకోవచ్చు.

**జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ**

మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ - మూక్స్ ద్వారా ఈ విద్యాసంస్థ ఆన్‌లైన్ కోర్సులను అందిస్తోంది. అప్పటి నుంచి ముప్పై లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. అంతేకాదు.. ఇవన్నీ వివిధ ర్యాంకింగ్ సిస్టమ్స్‌లో పోటీ పడి టాప్ ర్యాంకులు పొందిన కోర్సులు. ఈ కాలేజ్ అందించే మొత్తం 30 కోర్సుల్లో బిజినెస్, కంప్యూటింగ్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, సప్లైచెయిన్ అండ్ లాజిస్టిక్స్ అనే విభాగాలు ఉన్నాయి. వీటిలో డేటా అనలిటిక్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, యూఎక్స్ డిజైన్, డేటా అనాలిసిస్, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, పైతాన్, జావా, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిదమ్స్, మెకానిక్స్, మెటీరియల్స్, ఎలక్ట్రానిక్స్, మెషిన్ డిజైన్, అనలిటిక్స్ మోడలింగ్, స్టాటిస్టిక్స్, ఇన్నోవేషన్ లీడర్‌షిప్, సప్లై చెయిన్ ప్రిన్సిపల్స్... వంటి అనేక అంశాలు చదివే వీలుంది. ఎడ్ఎక్స్, కోర్సెరా, ఉడాసిటీ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా వీటికి ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

**మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)**

ఇందులో కోర్సులు గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయుల్లో ఉన్నాయి. ఇంజినీరింగ్, అర్బన్ స్టడీస్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, లిటరేచర్, ఆర్కిటెక్చర్, జాగ్రఫీ, కాగ్నిటివ్ సైన్స్, హిస్టరీ, ఏరోనాటిక్స్, ఫిజిక్స్, ఎకనమిక్స్, లింగ్విస్టిక్స్ - ఫిలాసఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆంత్రొపాలజీ, మీడియా స్టడీస్, బయాలజీ, న్యూక్లియర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్.. ఇలా దాదాపు అన్నిరకాలైన సబ్జెక్టులపై సుమారు 3 వేల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని చదివేవి, ఇంటరాక్టివ్ పద్ధతిలో లభించేవి విడివిడిగా దొరుకుతున్నాయి. సైంటిఫిక్ థియరీలను నేర్చుకునే క్రమంలో దీన్ని మించిన వర్సిటీ మరొకటి లేదనే ప్రఖ్యాతి ఉంది.

**యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా**

ఎడ్ఎక్స్ సంస్థతో అనుసంధానమై కోర్సులు అందిస్తోందీ వర్సిటీ. 2012 నుంచి దాదాపు 150 దేశాలకు చెందిన 40 లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరారు. ప్రొఫెషనల్ సర్టిఫికెట్స్ కూడా ఇస్తుంది. బిజినెస్ రైటింగ్, ఎలక్ట్రానిక్స్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఇంగ్లిష్ లిటరేచర్, జర్నలిజం, సోషల్ జస్టిస్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్రిప్టో కరెన్సీస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్.. ఇలా లభిస్తున్నాయి. గంటల నుంచి వారాల వ్యవధిగల ఈ కోర్సుల్లో ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కావాలంటే కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

**మిషిగాన్ స్టేట్ యూనివర్సిటీ**

ఫొటోగ్రఫీ, మ్యూజిక్, గేమ్ డెవలప్‌మెంట్, స్క్రిప్ట్ రైటింగ్, మైండ్‌వేర్, జర్నలిజం, రైటింగ్, పిక్సల్ ఆర్ట్, క్రియేటివిటీ, బిజినెస్ వంటి కోర్సులు చేయవచ్చు. గమనిస్తే... ఈ వర్సిటీ అందించేవన్నీ సంప్రదాయ చదువులకు భిన్నంగా ఉండే మార్గాలే! వీటి గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థులకు సులభంగా సమాచారం దొరికేలా ఈ ప్రోగ్రామ్స్‌ను అందుబాటులో ఉంచారు. ఇవి పూర్తి చేసిన తర్వాత కంప్లీషన్ సర్టిఫికెట్ లభిస్తుంది. వారానికి ఎన్నిగంటలు కావాలో అలా చదువుకునే వీలుంటుంది. దాదాపుగా 6 నెలల్లో పూర్తిచేయవచ్చు.

**కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఆర్ట్స్**

ఈ ఆర్ట్స్ కాలేజీ నుంచి విద్యార్థులు స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్స్ చేసే వీలుంది. క్రెడిట్స్, సర్టిఫికెట్స్ కావాలంటే ఫీజు చెల్లించాలి. ఫ్రీలాన్సింగ్ బిజినెస్, గేమ్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, మ్యూజిక్ థియరీ - టెక్నాలజీ, పొయిట్రీ, యూఐ/యూఎక్స్ డిజైన్, వెబ్ డిజైన్ వంటి ప్రోగామ్స్‌ను కోర్సెరా ప్లాట్‌ఫామ్ నుంచి చేయవచ్చు.

**యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్**

యూకేలో ఉన్న టాప్ కాలేజీల్లో ఇదీ ఒకటి. ఇటీవల విడుదల చేసిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇందులో ఆంత్రొపాలజీ, సిటిజన్ సైన్స్, కల్చర్, హెల్త్... ఇలా 170కి పైగా ప్రోగామ్స్ ఆన్‌లైన్‌లో చదవొచ్చు. దాదాపుగా ఉచితంగా లభిస్తాయి. కొన్ని ప్రత్యేక ప్రోగామ్స్‌కి మాత్రం ఫీజు చెల్లించాలి.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
శుక్రవారం, 20 ఫిబ్రవరి 2026


www.viswamvoice.com

### అబుదాబి ఓపెన్ మాస్టర్ గేమ్స్‌లో

# రాజమహేంద్రవరం క్రీడాకారుడి ప్రతిభ

**- టెన్నిస్ సింగిల్స్ డబల్, మిక్స్ డబుల్స్ ఈవెంట్స్‌లో 3 మెడల్స్ సాధన**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అబుదబిలో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించిన 2026 "ఓపెన్ మాస్టర్ గేమ్స్" టెన్నిస్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన క్రీడాకారుడు, ముదునూరి సత్య రాజ ఇంద్ర రాజు, అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుతూ విశేష విజయాలను నమోదు చేశారు. ఈ అంతర్జాతీయ టోర్నమెంట్ లో భారతదేశం తరపున మెన్స్40 ప్లస్ సింగిల్స్, డబుల్స్ మరియు మిక్స్ డబుల్స్ టెన్నిస్ ఈవెంట్లలో పాల్గొన్న ఇంద్రరాజు 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ విజయ ఆనందాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పంచుకోగా మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించిన ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 52 దేశాల నుంచి 500 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ టెన్నిస్ ఈవెంట్‌లో మన ప్రాంతీయ ఆటగాడు దేశానికి గౌరవం తెచ్చేలా పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. సత్య రాజ ఇంద్రరాజు మాట్లాడుతూ గ్లోబల్ సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ ద్వారా ఆల్ ఇండియా ర్యాంకింగ్ టోర్నీల్లో పాల్గొంటూ విజయాలు సాధించి ర్యాంకింగ్ పాయింట్లు సేకరించి అబుదాబి ఈవెంట్‌కు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అర్హత పొందడం జరిగిందన్నారు. తాను ఈ పతకాలు సాధించేందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. ఇది కేవలం విజయం కాదు... మూడేళ్ల తన పోరాటమన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు టెన్నిస్ స్పోర్టుకు ప్రోత్సాహం ఇస్తూ, క్రీడలకు రాజమహేంద్రవరంలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం జరుగుతోందన్నారు. విజనరీ నాయకత్వం దొరకడం రాజమహేంద్రవారం పౌరులకు మంచి అవకాశమని కొనియాడారు. ఈయన స్ఫూర్తి... ప్రోత్సాహం తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. తన ఈ విజయం రాజమహేంద్రవారం యువతను క్రీడల పరంగా ముందుకు సాగేలా ప్రేరేపిస్తుందని ఇంద్రరాజు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్.. ఇంద్రరాజును ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని జాతీయ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరిన్ని శిఖరాలను అధిరోహిస్తూ దేశానికి మరిన్ని పథకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

### కోడి పందాల స్థావరంపై

# పోలీసుల దాడి.. ఎనిమిది మంది అరెస్ట్



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరం పై పోలీసులు దాడి చేశారు. సమాచారం అందుకున్న దేవీపట్నం ఎస్సై షరీఫ్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 ద్విచక్ర వాహనాలు,రూ. 1230,రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### శిధిలావస్థలో ఉన్న భవనం స్థానంలో

# నూతన భవనానికి చర్యలు : ఎస్టీ కమిషన్ చైర్మన్



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి సందర్శించారు. కొత్తవీధి గ్రామం లో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల భవనం శిధిలావస్థలో ఉన్నట్టు గుర్తించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ముసుళ్ళగుంట, శరభవరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించి అక్కడ పరిస్థితులును తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూ సక్రమంగా అమలు జరుగుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కొరకు తన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

# డాక్టర్ వర్ధిని చందనకు అభినందన సత్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యువత సామాజిక సేవలో పాల్గొని సమాజ అవసరాలు తీర్చడానికి కృషి చేయాలని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు ఆకాంక్షించారు. సాధన ఫౌండేషన్ స్థాపించి తద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్యురాలు వర్ధిని చందన ను రాంబాబు అభినందించారు. గురువారం ఉదయం స్థానిక నందశీ గనిరాజు సెంటర్లో గల మాగ్నా చిన్నపిల్లల ఆసుపత్రిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వర్ధినినీ శాలువతో సత్కరించి అభినందన జ్ఞాపికను బహుకరించారు. అలాగే గురువారం శుక్రవారం రెండు రోజులపాటు ఉచిత స్కానింగ్ సౌకర్యాన్ని అందిస్తున్న ఆసుపత్రి సేవలను రాంబాబు ప్రశంసించారు. సాధన ఫౌండేషన్ నిర్మాణాత్మక ప్రజా ప్రయోజన సేవా కార్యక్రమాలు అందించడానికి కృషి చేయాలని రాంబాబు పలు సూచనలు చేశారు. మహిళలు చిన్నపిల్లల కోసం అవసరమైన వైద్య సేవలు డాక్టరు వర్ధిని అందించేందుకు ముందుకు రావడం అందరూ అభినందించాలన్నారు. ఇలాగే వైద్య వృత్తిలో ఉన్న యువ వైద్యులు ముందుకు వచ్చి తగు సేవలు అందించాలని రాంబాబు కోరారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్ని వర్ధిని దంపతులకు రాంబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో చందన నాగేశ్వర్, హాస్పిటల్ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# యేసయ్య సువార్త స్వస్థత ఉజ్జీవ సభలు

**20వ తేదీ నుంచి మూడు రోజులు.. రాజానగరం మండలం కలవచర్లలో నిర్వహణ**

**చివరిరోజు 22న మడికి సుగుణమ్మ 17వ సంవత్సర జ్ఞాపకార్థ కూడిక - రెవ మడికి పరంజ్యోతి బాబు, మేరీ కుమారి సారధ్యంలో ఏర్పాట్లు**



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు యేసయ్య సువార్త స్వస్థత ఉజ్జీవ సభలు రాజానగరం మండలం కలవచర్లలో జరుగుతాయి. ఇందుకోసం రెవ. మడికి పరంజ్యోతి బాబు,మేరీ కుమారి సారధ్యంలో ఏర్పాట్లు చేస్తూ, ఆహ్వానిస్తున్నారు. లాజరస్ సుగుణ మెమోరియల్ పెంతెకోస్తు దేవుని సంఘము ఆధ్వర్యాన నిర్వహించే ఈ సభల్లో ఏడిద సిలోహు ప్రేయర్ టెంపుల్ బిషప్ డా. పిటి జేమ్స్ పాల్, ఒంగోలుకు చెందిన రెవ. కె జోసఫ్, పాలచర్ల క్రైస్ట్ సెంటర్ మినిస్ట్రీస్ సహో. గ్రేస్ విక్టర్ వాక్యోపదేశకులుగా హాజరవుతారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30గంటలకు జరిగే ఈ సభల్లో రోగుల కొరకు స్వస్థత ప్రార్ధనలు కూడా చేస్తారు.ఆఖరి రోజున 22న స్వర్గీయ మడికి సుగుణమ్మ 17వ సంవత్సర జ్ఞాపకార్థ కూడిక నిర్వహిస్తారు.ఈ సభల్లో లఫ్లీ ఆర్కెస్ట్రా, స్థానిక సంఘం, లఫ్లీ క్వయర్ వారిచే ఆత్మీయ మధుర గీతాలు వినిపిస్తారు.ఈ మూడురోజులూ అద్భుత రాత్రులుగా జరిగే సభలను జయప్రదం చేయాలని రెవ. మడికి పరంజ్యోతిబాబు, మేరీ కుమారి, సంఘ పెద్దలు, విశ్వాసులు, యూత్ కోరుతున్నారు.

# 'రాకీ'తో షేక్ హ్యాండ్..



రామ్మోహన్ నాయుడు వీడియో వైరల్ విశాఖ విమానాశ్రయంలో పోలీస్ డాగ్ రాకీతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కరచాలనం చేయడం నెటిజన్లను ఆకట్టుకుంది. నిత్యం బిజీగా ఉండే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తనలో మరో కోణం బయటపెట్టారు. విశాఖలో ఫ్లీట్ రివ్యూ కార్యక్రమానికి వచ్చిన కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు తిరుగు ప్రయాణంలో నెటిజన్లను ఆకట్టుకున్నారు. ఆయన చేసిన పనిని అభిమానులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అవుతోంది. కేంద్ర మంత్రిగా ప్రొటోకాల్ ను పక్కన పెట్టి రామ్మోహన్ నాయుడు కాసేపు సరదాగా గడపడం అందరినీ ఆకట్టుకుంది. హోదాలను పక్కన పెట్టి రాకీతో కరచాలనం చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్లు చేస్తున్నారు. విశాఖ విమానాశ్రయంలో పోలీస్ డాగ్ రాకీతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కరచాలనం చేయడం నెటిజన్లను ఆకట్టుకుంది. విశాఖ ఫ్లీట్ రివ్యూ ముగించుకుని ఢిల్లీకి తిరుగు పయానమైన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కాసేపు వీఐపీ లాంజ్ లో ఉన్నారు. విమానం బయలుదేరే సమయంలో లాంజ్ నుంచి బయటకు వస్తుండగా, అక్కడే విధుల్లో ఉన్న పోలీసు జాగిలం రాకీని చూశారు. వెంటనే దాని వద్దకు వెళ్లి తలపై చేయి వేసి ఆప్యాయంగా నిమిరారు. కాసేపు సరదాగా ఆడుకున్నారు. ఇక పక్కనే ఉన్న సిబ్బంది సూచనలతో రాకీ కేంద్ర మంత్రికి షేక్ హ్యాండ్ ఇచ్చింది. ఈ దృశ్యం అక్కడ ఉన్నవారిని ఆకట్టుకుంది. కొందరు వీడియోలు తీసి తమ సోషల్ మీడియా గ్రూపుల్లో షేర్ చేయడంతో వైరల్ అయింది. కేంద్ర మంత్రిగా ఉన్న రామ్మోహన్ నాయుడు తన హోదాను పక్కన పెట్టి పోలీసు జాగిలం తలపై నిమిరడం, దానితో కరచాలనం చేయడాన్ని విశేషంగా చెబుతున్నారు. రామ్మోహన్ నాయుడు స్వతహాగా మూగ జీవాలను ప్రేమిస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పోలీసు జాగిలాన్ని చూడగానే, అక్కడికి వెళ్లి దాని పేరు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా 'హలో రాకీ.. హౌ ఆర్ యూ' అంటూ పలకరించారు. సాధారణంగా కేంద్ర మంత్రులు వెళ్తున్నప్పుడు అధికారులు, సిబ్బంది హడావుడి కనిపిస్తుంది, కానీ రామ్మోహన్ నాయుడు మాత్రం అధికారుల హడావుడిని దాటుకుని పోలీసు జాగిలం వద్దకు వెళ్లడం, దానికి షేక్ హ్యాండ్ ఇచ్చి, ఎంతో ప్రేమగా నిమరడంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్లు చేస్తున్నారు. డ్యూటీలో నిమగ్నమైన ఆ జాగిలం కూడా మంత్రి ప్రేమకు ప్రతిస్పందించడం ఆకట్టుకుందని అంటున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మంత్రి హోదాలో ఉన్నప్పటికీ, మూగజీవాల పట్ల ఆయన చూపిన ఈ ఆత్మీయత నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. "మంత్రి గారు భలే సరదా మనిషి" అంటూ విమానాశ్రయ ప్రయాణికులు కూడా చర్చించుకున్నారు.

### అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యే..

# టీడీపీ సభ్యులతో స్పెషల్ డిబేట్!



ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. సభకు విపక్షం వైసీపీ గైర్హాజరుతో సమావేశాలు ఏకపక్షంగా సాగుతున్నాయి. దీంతో ప్రజలు సైతం ఆ సమావేశాలను పెద్దగా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కానీ, ఇదే సమయంలో మండలిలో చర్చలు ఆసక్తిరేపుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా విమర్శలు, ప్రతివిమర్శలతో మండలి హీటెక్కుతోంది. ప్రజలు కూడా మండలి చర్చలను ఎక్కువగా ఆస్వాదిస్తున్నారని అంటున్నారు. అయితే ఇటు మండలి, అటు అసెంబ్లీకి మించిన పరిణామం ఒకటి అసెంబ్లీ లాబీల్లో కనిపించింది. ఈ పరిణామం సభ లోపల, బయట హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ అసెంబ్లీని యథావిధిగా విపక్ష వైసీపీ బహిష్కరించింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున సభకు హాజరైన వైసీపీ సభ్యులు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న కారణంగా నిరసన వ్యక్తంచేస్తూ వాకౌట్ చేశారు. ఇక అప్పటి నుంచి వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వైపు చూడలేదు. దీంతో అసెంబ్లీ ఏకపక్షంగానే సాగిపోతోందని అంటున్నారు. అయితే ఏమైందో కానీ బుధవారం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆకస్మికంగా అసెంబ్లీకి వచ్చారు. సభ లోపలకు వెళ్లపోయినా లాబీల్లో తిరుగుతూ కనిపించారు. ఈ సమయంలో ఆయనతో ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు మాటలు కలిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసలు అసెంబ్లీ వైపు చూడకపోగా, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ లాబీల్లో ప్రత్యక్షం అవడంపై అధికార పార్టీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సభకు రావాల్సిందిగా మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యే చంద్రశేఖర్ ను ఆహ్వానించారు. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ పర్యటన ఖర్చులపై వైసీపీ విమర్శలు వారి మధ్య చర్చకు వచ్చాయని అంటున్నారు. అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ పై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిందిపోయి, బిల్ గేట్స్ కు పెట్టిన సమోసా, టీ ఖర్చులపై వైసీపీ ప్రశ్నించడం ఏంటంటూ? ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు విపక్ష ఎమ్మెల్యే చంద్రశేఖర్ ను అడిగినట్లు చెబుతున్నారు. దీంతో వారి ప్రశ్నలపై ఎమ్మెల్యే తాటిపర్తి స్పందిస్తూ 'మీకు అన్నీ తెలిసి నాతో అడుకుంటున్నారా' అని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. కొద్దిసేపు మాత్రమే వైసీపీ ఎమ్మెల్యేతో టీడీపీ ఎమ్మెల్యేలు మాట్లాడినా, వారి మధ్య చర్చకు వచ్చిన అంశం, వైసీపీ ఎమ్మెల్యే స్పందించిన విధానంపై అసెంబ్లీ లాబీల్లో పెద్ద చర్చే జరిగిందని అంటున్నారు. వైసీపీ అసెంబ్లీని బహిష్కరించినా, కొందరు ఎమ్మెల్యేలు సమావేశాలు జరుగుతున్న తీరును బయట నుంచి పరిశీలించేందుకు అసెంబ్లీ వద్దకు వస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అధిష్టానం ఆదేశాలతో సభ లోపలకు వెళ్లలేకపోతున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీకి మొత్తం 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మాజీ సీఎం జగన్, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటివారు అసెంబ్లీకి వెళ్లినా, వెళ్లకపోయినా పెద్దగా ఇబ్బంది ఏమీ ఉండదని అంటున్నారు. వారి నియోజకవర్గాల్లో వీరు అసెంబ్లీకి హాజరయ్యారా? లేదా? అన్న అంశం అసలు ఏమాత్రం చర్చకు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. కానీ, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మాత్రం అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయంతో లోలోన ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ విషయం అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారని టీడీపీ మీడియా ప్రచారం చేస్తోంది. ఇందులో ఎంత వాస్తవం ఉందో గానీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అసెంబ్లీ లాబీల్లో తిరగడంపై పెద్ద చర్చే జరుగుతోంది.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
శుక్రవారం, 20 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com



హిందూ సామ్రాజ్య స్థాపకుడు మరాఠా యోధుడు

# ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గోరక్షకులు ప్రముఖ హిందూ ధార్మిక నాయకులు కోటిపల్లి రఘురాం వేణుగోపాల్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య స్థాపకుడు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొన్నారు ముందుగా బోడి పాలెం వంతెన సెంటర్ వద్ద శివాజీ మహారాజ్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా బయలుదేరి వాడపాలెం పంచాయతీ సెంటర్ వద్ద ఉన్న శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి జై భవానీ వీర శివాజీ అంటూ కొనియాడారు. అనంతరం ఆరెస్సెస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ (1630–1680) పశ్చిమ భారతదేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడని ఆయన ఫిబ్రవరి 19, 1630న శివనేరి కోటలో జన్మించిన శివాజీ, తల్లి జిజా బాయి, తండ్రి షాహాజీ భోంస్లేల మార్గ దర్శకత్వంలో చిన్న వయస్సులోనే తోర్నా కోటను గెలిచి, గెరిల్లా యుద్ధతంత్రం (గోరిల్లా వార్‌ఫేర్) ద్వారా మొఘల్, బీజాపూర్ సుల్తానులను ఎదిరించి స్వరాజ్యాన్ని నెలకొల్పారని అన్నారు. 16 ఏళ్ల వయస్సులోనే తోర్నా కోటను స్వాధీనం చేసుకుని, రాజ్గఢ్, కొండన, పురందర్ కోటలను గెలుచుకున్నారు.గెరిల్లా యుద్ధ తంత్రం శివాజీ గెరిల్లా యుద్ధ విద్యలో నిష్ణాతులు. ఆదిల్షా, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యాలను మెరుపు దాడులతో విస్తుపోయేలా చేశారని కొనియాడారు. 1674 జూన్ 6న రాయఘడ్ కోటలో 'ఛత్రపతి'గా పట్టాభిషేకం చేసుకుని, స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని ప్రకటించారు.శివాజీ సామ్రా జ్యాన్ని ఎనిమిది మంది మంత్రుల మండలి (అష్టప్రధాన్) ద్వారా పాలించారు.మహిళల పట్ల గౌరవం,ఇతర మతాల పట్ల సహనం, సరైన పరిపాలనా వ్యవస్థ ఆయన ప్రత్యేకత. ఏప్రిల్ 3, 1680న అనారోగ్యం తో రాయఘడ్ కోటలో స్వర్గస్తులైనారన్నారు. శివాజీ భారతీయ చరిత్రలో ధైర్యసాహసాలకు, స్వపరిపాలనకు, హిందూ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచారని హిందువులరికీ ఆదర్శ వంతులని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కోటిపల్లి సుబ్రహ్మణ్యం, కోటిపల్లి దామోదర్, గంగారాం, అంజిబాబు, హిందూ బంధువులు నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురులో ఐదు ఎకరాల్లో

# సమగ్ర క్వాయర్ పార్క్ ఏర్పాటు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఒక జిల్లా – ఒక ఉత్పత్తి (ఓడిఓపి) కార్యక్రమం భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో క్వాయర్ పరిశ్రమల అభివృద్ధికి కీలక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. మామిడికుదురు మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల కాంపోనెంట్ ఉత్పత్తులతో కూడిన సమగ్ర క్వాయర్ పరిశ్రమ స్థాపనకు సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీఐఐసీ అధికారులు, రీజనల్ క్వాయర్ బోర్డు ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికుదురు ప్రాంతంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఎంఎస్ఎమ్ఈ పార్క్, ఇంక్యుబేషన్ సెంటర్‌ల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని, క్వాయర్ ఉత్పత్తుల ఎగుమతులకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఉప్పలగుప్తం మండలంలో రూ.13.50 కోట్ల అంచనా వ్యయంతో క్వాయర్ ఉత్పత్తుల అభివృద్ధి కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఇంక్యుబేషన్ సెంటర్‌లను స్థాపించేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్వాయర్ యార్న్, మ్యాట్స్, కోకోపిట్, జియోటెక్స్టైల్స్, వుడ్ ఆధారిత ఉత్పత్తులు, గార్డెన్ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ఆధునిక యంత్రాలు, ఆపరేషన్ విధానాలు, నాణ్యత ప్రమాణాలు, బ్రౌన్ ఫైబర్‌ను వైట్ ఫైబర్‌గా మార్పు చేసే ప్రక్రియలపై విస్తృతంగా చర్చించారు. స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సపోర్ట్, మార్కెటింగ్, ఎగుమతి, బ్రాండింగ్ ప్రోత్సాహం వంటి అంశాలతో ఈ కేంద్రాన్ని ఎక్స్‌పోజర్ విజిట్ హబ్‌గా అభివృద్ధి చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఏ ఉత్పత్తికి ఎంత పెట్టుబడి అవసరం, ఏ యంత్ర సామగ్రితో ఉత్పత్తి లాభదాయకంగా సాగుతుందనే అంశాలపై అధ్యయనం చేసే విధంగా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల రాయితీలతో యువ పారిశ్రామికవేత్తలు యూనిట్లు స్థాపించుకునేలా మార్గదర్శనం చేయాలని, స్థానిక యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు. జియోటెక్స్టైల్ ప్రొడక్షన్ యూనిట్, డైయింగ్ ఒ ఫినిషింగ్ యూనిట్, టెస్టింగ్ ల్యాబ్, క్వాలిటీ కంట్రోల్ విభాగం, ప్యాకేజింగ్ మరియు స్టోరేజ్ సదుపాయాలను ఒకే వేదికపై అందించి ఖర్చు తగ్గింపు సాధించాలని సూచించారు. క్లస్టర్ ఆధారిత అభివృద్ధి, సహకార వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, నూతన ఆలోచనలకు ప్రాధాన్యం ఇస్తూ యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శక కేంద్రంగా ఈ యూనిట్ నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించి ఉపాధి సృష్టి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా సమగ్ర క్వాయర్ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్ర మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు జయంతి వేడుకలు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

రాష్ట్ర మాజీ వాణిజ్య పన్నుల శాఖా మంత్రి కుడుపూడి ప్రభాకరరావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు. గురువారం అమలాపురం రూరల్ మండలం నడిపూడి లాకుల వద్ద ఉన్న దివంగత కుడుపూడి ప్రభాకరరావు విగ్రహానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో "సర్దార్ కాటన్"గా పేరొందిన ప్రభాకరరావు కాలువల ఆధునీకరణ ద్వారా వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. మాజీ డ్రైనేజీ బోర్డు చైర్మన్‌గా ఉన్న సమయంలో పంటకాలువలను ఆధునీకరించి వేలాది ఎకరాల్లో సాగుకు నీరందేలా చర్యలు తీసుకుని రైతులకు మేలు చేకూర్చారని ఆయన గుర్తు చేశారు. అలాగే మంత్రి హయాంలో గిడ్డంగుల నిర్మాణం, వాణిజ్య పంటల ఎగుమతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషించారని వివరించారు. ప్రభాకరరావు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని, ఆయన సేవలు ఎప్పటికీ స్మరణీయమని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజలు, రైతులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దటీజ్ అనంత్ అంబానీ..

## ఓ ఆలయానికి ఏకంగా రూ.27.5 కోట్ల భారీ విరాళం!



ప్రముఖ పారిశ్రామికవేత్త అనంత్ అంబానీ గుజరాత్‌లోని అంబాజీ ఆలయానికి రూ..27.5 కోట్ల భారీ విరాళం ప్రకటించారు. 'జై అంబే తిథి భోజన్ యోజన' కింద భక్తులకు ఐదేళ్లపాటు ఉచితంగా భోజనం అందించడమే దీని లక్ష్యం. ఆయన దాతృత్వంతో పాటు సమాజ సేవకు నిదర్శనంగా నిలిచిన ఈ చర్య, ఆలయానికి వచ్చే వేలాది మంది యాత్రికులకు ఎంతో సహాయపడుతుంది. అపర కుబేరుడు, భారతదేశ ప్రముఖ పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ తన గొప్ప మనసును మరోసారి చాటుకున్నాడు. తన పెళ్లితో మొత్తం ప్రపంచం ఇండియా వైపు తిరిగి చూసేలా చేసిన అనంత్ ఇప్పుడు సేవా కార్యక్రమాల ద్వారా మరోసారి వార్తల్లో నిలిచారు. గుజరాత్‌లోని ప్రసిద్ధ అంబాజీ ఆలయానికి ఆయన రూ.27.5 కోట్ల భారీ విరాళం ప్రకటించారు. భక్తి భావనతో పాటు సమాజ సేవకు ప్రాధాన్యం ఇస్తూ ఈ విరాళాన్ని ప్రత్యేకంగా జై అంబే తిథి భోజన్ యోజన కోసం అందించారు. ఈ పథకం ప్రధాన లక్ష్యం అంబాజీ ఆలయాన్ని సందర్శించే ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదనేదే. ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు ఆలయానికి చేరుతుండగా, వారికి రోజుకు రెండుసార్లు ఉచితంగా భోజనం అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తారు. ట్రస్ట్ అంచనాల ప్రకారం ఈ అన్నదాన కార్యక్రమానికి రోజుకు సుమారు రూ.1.51 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ఫిబ్రవరి 18న ప్రారంభమైన ఈ యోజనకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. మొదటి రోజే మొత్తం విరాళాలు రూ.30 కోట్లకు మించి చేరాయి. ఇందులో ప్రధాన దాతగా అనంత్ అంబానీ నిలిచారు. ఆయన ఇచ్చిన నిధులు వచ్చే ఐదేళ్లపాటు ఆహార సేవ ఖర్చును భరించేలా ప్రణాళిక రూపొందించారు. ఇతర దాతల్లో అహ్మదాబాద్‌కు చెందిన ఒక భక్తుడు 35 ప్రత్యేక దినాల్లో భోజన సేవను స్పాన్సర్ చేయడానికి రూ.52 లక్షలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో అంబాజీ దేవస్థాన్ ట్రస్ట్, జిల్లా అధికారులు రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని ప్రధాన దాతలను సత్కరించారు. ఈ చొరవతో భక్తులకు ఉచితంగా సంపూర్ణ, పోషకాహారం అందడంతో పాటు వారి ఆధ్యాత్మిక యాత్ర మరింత సార్థకంగా మారుతుందని ట్రస్ట్ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఇండ్ల స్థలాల పేరుతో కోట్లు దండుకున్న

# అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



కూటమి నాయకులు డిమాండ్

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాలు, పట్టాలు పంపిణీపై విచారణ చేయాలి గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొత్తపేట నియోజక వర్గంలో వందలాది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అందుకొరకు పెద్ద ఎత్తున స్థలాలు కొనుగోలు చేశారు.స్థలాలు కొనుగోలులో భారీ అవినీతి చోటుచేసుకుంది నాడు ఎకరం విలువ కన్నా నాలుగు, ఐదు రెట్లు ఎక్కువ చెల్లించి భూములు కొనుగోలు చేశారు. ఈ భూములను పేదలకు పంపిణీ పేరుతో పట్టాలు అందించారు. అయితే నేటికీ ఆ స్థలాలు ఎక్కడున్నాయో చాలామంది పేదలకు తెలియదు. వీరిలో చాలామంది గత కొద్ది నెలలుగా ప్రజా దర్బార్లో తమకు స్థలాలు కేటాయించాలంటూ వినతులు అందిస్తున్నారు. ఒకపక్క వైసీపీ నేతలు తాము వేల సంఖ్యలో పట్టాలందించామని చెబుతున్నారు. అయితే వీటిలో చాలా పట్టాలు ఎందుకు పనికిరాని చిత్తు కాగితాల్లా పేదలు ఇల్లల్లో ఉన్నాయి.ఇల్లు వస్తుందని ఆశ చూపి, కాగితాలు చేతిలో పెట్టి సత్కారాల పేరుతో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం చేశారు. స్థలాలు కొనుగోలుతో పాటు మెరక పేరుతో మట్టిని తరలించారు. ఈ అక్రమాలు అన్నింట పైన ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ జరపాలి.పేదలకు న్యాయం జరిగేలా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందించాలి. అనర్హులను గుర్తించి వేరు వేయాలి.ఇండ్ల స్థలాల పేరుతో కోట్లు దండుకున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని ముత్యాల బాబ్జి జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు యల్లమిల్లి జగన్మోహన్ రావు యూనిట్ ఇంఛార్జి,మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి.కాశి ధనరాజు పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి అంబాజీపేట మండల కూటమి నాయకులు ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. అంబాజీపేట సెంటర్లు నాలుగు రోడ్ల జంక్షన్లో స్వీట్లు పంపిణీ చేశారు. మండల కూటమి నాయకులకు మాట్లాడుతూ భారతదేశం చరిత్రలో వన్నె తీసుకొచ్చిన మహనీయుడు అని అన్నారు. హైందవ మతాన్ని జాగృతి చేస్తూ హిందువుల యొక్క ప్రాణమానాల్ని కాపాడి సమరయోధుడు అని కొనియాడారు. ఈ దేశం గర్వించదగ్గ మహాయోధుడు సౌర్యం పరాక్రమం ధర్మ పాలనకు చిహ్నమైన మహనీయుని జన్మదిన వేడుకలను జరుపుకోవడం ఆనందకరమని అన్నారు ఆయన ఆశయాలను ప్రజల్లో ఇనుముడెంపజేయడం గొప్ప విషయంగా పరిగణిస్తూ కూటమి ప్రభుత్వం ఆయన ఆశయాలను ప్రతిక్షణం ప్రజలకు చేరువై హైందవ మతాన్ని కాపాడుతూ పోరాటం చేయాలని కొనియాడారు. తొలితా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కముజు శ్రీనివాసరావు , దొమ్మేటి సాయి కృష్ణ, అరిగెల బలరామమూర్తి , మహిపాల తాతాజీ, నాగ బత్తుల వెంకట సుబ్బారావు, సుంకర బాలాజీ , పితాని రామకృష్ణ, ఉందుర్తి నాగబాబు, పితాని కేశ్వరావు, అప్పన గణపతి రావు, బొక్క శ్రీహరి, అడపా వెంకటరత్నం, అంతర్వేది దేవి సూర్యలక్ష్మి, పితాని సత్యనారాయణ,కంచర్ల రామకృష్ణ,గుత్తుల రామకృష్ణ,ఆకెళ్ళ సూరిబాబు అయ్యగారి కృష్ణ సుందరం, మట్టపర్తి బుల్లి స్వామి, మట్టపర్తి రమేష్,గొలగోటి నరేష్, బందారు అబ్బులు, గుత్తుల బాల సూర్యనారాయణ, సత్తాల నాగరాజు, నేదునూరి రాజకుమార్, పళ్ళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోనలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు చెయ్యరు పంచాయితీ ప్రాంగణంలో, పంచాయతీ సర్పంచ్ చెల్లి సురేష్ మరియు మట్ట సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా దేశభక్తి ఉత్సాహంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కాట్రేనికోన సబ్ ఇన్స్పెక్టర్ ఐ.అవినాష్ మరియు బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ విచ్చేసినారు. అధ్యక్షులు మట్టా శివకుమార్, సుంకర నాగేశ్వరావు, నంద్యాల చంటి మరియు సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మహానుభావుడైన మరాఠా వీరుడు, దేశనిర్మాత ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం ద్వారా ప్రారంభమైంది. అనంతరం అతిథులుగా కాట్రేనికోన సబ్ ఇన్స్పెక్టర్ ఐ అవినాష్ ప్రసంగిస్తూ శివాజీ మహారాజ్ జీవితం, వీరత్వం, పరిపాలనా నైపుణ్యం మరియు ఆయన స్థాపించిన స్వరాజ్య సిద్ధాంతాల గొప్పతనాన్ని వివరించారు. ధర్మరక్షణ, మహిళల గౌరవ పరిరక్షణ, ధైర్యం, స్వాభిమానం మరియు మంచి పాలనకు శివాజీ మహారాజ్ చిరస్మరణీయ ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. మరొక అతిథిగా వచ్చిన బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ ప్రసంగిస్తూ యువత శివాజీ మహారాజ్ చూపిన మార్గంలో నడుచుకొని దేశ నిర్మాణంలో క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ముంగండ మంచినీటి చెరువులో పడి

# చనిపోయిన పదవ తరగతి విద్యార్థిని





**పి.గన్నవరం విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం ముంగండ జడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న కుడిపూడి కరుణ (15) ప్రమాదవశాత్తు ముంగండ మంచి నీటి చెరువులో జారిపడి మృతి.. మృత దేహాన్ని వెలికితీసి.. ఎస్ఐ శివకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెక్సాస్‌లోని హనుమాన్ విగ్రహంపై

# మాగా మద్దతుదారుడు వివాదాస్పద వ్యాఖ్యలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలోని టెక్సాస్ నగరంలో ఉన్న హిందూ దేవుడి విగ్రహంపై మాగా మద్దతుదారుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విగ్రహం ఏర్పాటును భారతీయ వలసదారుల దండయాత్రకు నిదర్శనమని అభివర్ణిస్తూ ఆయన చేసిన పోస్టుపై తీవ్ర దుమారం రేగుతోంది. టెక్సాస్‌లోని హూస్టన్ నగరంలో శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో 90 అడుగుల హనుమాన్ కాంస్య విగ్రహం ఉంది. 'స్టాచ్యూ ఆఫ్ యూనియన్'గా పిలిచే ఈ హనుమాన్ విగ్రహం ఉత్తర అమెరికాలోనే అత్యంత ఎత్తయినది. ఈ విగ్రహానికి సంబంధించిన వీడియోను మాగా మద్దతుదారుడు కార్లోస్ టుర్సియోస్ ఎక్స్ వేదికగా పోస్టు చేశాడు. వలసదారులు టెక్సాస్, అమెరికాను ఆక్రమించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అమెరికాలో హిందూ విగ్రహం ఎందుకని ప్రశ్నించారు. ఈ దండయాత్రను ఆపాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కార్లోస్ వ్యాఖ్యలను ఆలయానికి చెందిన కమ్యూనిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రైవేటు ప్రాపర్టీ అని.. విరాళాలు సేకరించి దీన్ని ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. నెటిజన్లు సైతం కార్లోస్ వ్యాఖ్యలను ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. కాగా.. ఇదే విగ్రహంపై గతంలో రిపబ్లికన్ పార్టీ నేత అలెగ్జాండర్ డంకన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి హిందూ విగ్రహాన్ని ఇక్కడ మేమెందుకు అనుమతించాలంటూ పేర్కొన్నారు. డంకన్ వ్యాఖ్యలను హిందూ అమెరికన్ ఫౌండేషన్ తీవ్రంగా ఖండించింది.

### శంఖవరం సామాజిక తనిఖీలో

# రూ. 2,33,888ల రికవరీకి ఆదేశం

## మేట్లకు రూ.6,000ల జరిమానా విధింపు - రూ.80,18,555ల ఖర్చుల ఉపసంహరణ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదికను గురువారం నిర్వహించారు. మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని 33 నివాసిత ప్రాంతాల్లో 17 వ విడతగా 01.04.2024 నుండి 31.03.2025 వరకూ ఉపాధిహామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధిశాఖ రక్షిత తాగునీటి సరఫరా విభాగం, అటవీశాఖ, సామాజిక అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మండలం మొత్తం మీద 866 వివిధ అభివృద్ధి పనులకు మొత్తం రూ. 15,68,06,835 ఖర్చు చేసారు. వీటిలో ఉపాధి కూలీలకు రూ. 7,60,81,478 లను వేతనాల చెల్లింపులకు, వివిధ వస్తు సామాగ్రి కొనుగోలుకు రూ. 8,03,13,248 లను వినియోగించారు. ఈ నిధుల వ్యయం వివరాలను ఆయా శాఖల వారీగా చూస్తే... మండలం మొత్తం మీద ఉపాధి హామీ పథకం నుంచి 821 పనులకు మొత్తం రూ. 84,77,0376 లను ఖర్చు చేయగా వీటిలో రూ. 74,469,604 లను కూలీలకు, వస్తు సామాగ్రి కొనుగోలుకు రూ. 98,88,663 లను చెల్లించారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ నుంచి 2 పనులకు రూ. 5,45,24,716 లను ఖర్చు చేయగా వీటిలో రూ. 12,04,055 లను కూలీలకు,




రూ. 53,32,0661 లను వస్తు సామాగ్రి కొనుగోలుకు చెల్లించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి మొత్తం రూ. 1,68,25,442 లను ఖర్చు చేయగా వీటిలో కూలీలకు రూ. 38868 లను, వస్తు సామాగ్రి కొనుగోలుకు రూ. 1,67,86,574 లను చెల్లించారు. అటవీశాఖ నుంచి మొత్తం 6 పనులకు రూ. 6,86,301 లను ఖర్చు చేయగా వీటిలో కూలీలకు రూ. 3,68,951 లను, వస్తు సామాగ్రి కొనుగోలుకు రూ. 3,17,350 లను చెల్లించారు. ఈ నిధుల వ్యయం, వినియోగంలోని నిజానిజాలను ప్రజల సమక్షంలో నిగ్గు తేల్చేందుకు మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల స్థాయి ప్రజా వేదికను నిర్వహించారు. ఆయా అభివృద్ధి పనులకు సంబందించి ఆంధ్ర ప్రదేశ్ సామాజిక తనిఖీ, జవాబుదారీ పారదర్శక (ఆంధ్ర ప్రదేశ్ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అండ్ ట్రాన్స్పరెన్సీ - ఏపిఎస్ఎస్ఏఏటి) సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్వతంత్ర తనిఖీ నిర్వహించారు. 01.04.2024 నుండి 31.03.2025 వరకూ ఆయా పంచాయతీల వారీగా వజ్రకూటంలో రూ. 15, 67,443 లతో 12 పనులు, కత్తిపూడిలో రూ. 90,26,418 లతో 111 పనులు, మండపంలో రూ. 1,03,77,570 లతో 43 పనులు, శంఖవరంలో రూ. 1,77,40,716 లతో 77 పనులు, సీతయ్యమ్మపేటలో రూ. 63,09,339 లతో 60 పనులు, అన్నవరంలో రూ. 31,74,561 లతో 48 పనులు, శంఖవరం జగ్గంపేటలో రూ. 32,00,198 లతో 48 పనులు, అచ్చంపేటలో రూ.52,13, 390లతో 71 పనులు, గొంధికొత్తపల్లిలో రూ. 66,15,613 లతో 48 పనులు, నెల్లిపూడిలో రూ. 99,76,090 లతో 63 పనులు, గౌరంపేటలో రూ. 1,07,87,655 లతో 61 పనులు, కొంతంగిలో రూ.1,02,63,092 లతో 79 పనులు, వేళంగిలో రూ.5,85,52,398 లతో 84 పనులు, పెదమల్లాపురంలో రూ. 39,14,400లతో 53 పనులనూ పూర్తి చేసినట్లు మధ్యాహ్నం 12.55 గంటల వరకూ మూడు గంటల పాటు జరిగిన ఈ సామాజిక తనిఖీల్లో సభికులకు చదివి వినిపించారు. ఈ సామాజిక తనిఖీల్లో తనిఖీ బృందం అధికారులు గుర్తించిన ముఖ్యాంశాలను సాయంత్రం 6 గంటలకు సామాజిక మాధ్యమంలో మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం... మొత్తం 14 పంచాయతీల పరిధిలోనూ కొలతల్లో జరిగిన తేడాల వల్ల రూ. 95,22,630ల ఖర్చులకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ పరిశీలన బృందం గుర్తించింది. వీటిలో మొత్తం రూ. 2,33,888లను తిరిగి రాబట్టాలని నిర్ధారించారు. మండలం మొత్తం మీద తప్పుడు హాజరు వేసి కూలీలకు అదనంగా చెల్లించిన రూ.6,000లను మేట్లకు జరిమానాలుగా విధిస్తూ వీటిని మేట్లే చెల్లించాలని నిర్దేశించారు. అలాగే 14 పంచాయతీల పరిధిలో వివిధ పనులకు సంబంధించిన రూ. 1,26,4187 ఖర్చుల వివరాలను మేట్లు సమర్పించాల్సి ఉందని, అలా సమర్పించని పక్షంలో ఈ మొత్తాన్ని కూడా మేట్ల నుంచి తిరిగి వసూలు చేస్తామని, మండలం మొత్తం మీద రూ. 80,18,555ల ఖర్చుకు సంబంధించి ఏవిధమైన చర్యలనూ తీసుకోకుండా ఉపసంహరించు కున్నట్టు సామాజిక తనిఖీ బృందం ప్రకటించింది.

### ఆందోళన బాట పట్టిన

# సహకార సంఘాల ఉద్యోగులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సహకారసంఘాల ఉద్యోగుల నిరసనలుమిన్నంటాయి. జిల్లాలోని కార్యాలయాల వద్ద ఉద్యోగులు ఆందోళన చేశారు. డిమాండు తీర్చాలంటూ కొన్ని రోజులుగా సాగుతున్న నిరసనలు నిరవధిక సమ్మెకు దారితీశాయి.ఉద్యోగ పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని,2019 తర్వాత సహకార సంఘాల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఇంకా పలు డిమాండ్లతో రెండు నెలలుగా సహకార సంఘాల ఉద్యోగులు నిరసన బాటపట్టారు.రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జేఏసీ పిలుపుమేరకు కాకినాడ దేవాలయం బ్రాంచ్ నందు పెనుగుదురు, సర్పవరం, పండూరు సహకార సంఘాల ఉద్యోగుల ఆందోళన చేసారు.

### తారిఖ్ రెహమాన్ ప్రధానమంత్రి అయిన వెంటనే

# భారత విమానయాన సంస్థపై నిషేధం..!




బకాయిలు చెల్లించని కారణంగా బంగ్లాదేశ్ తారిఖ్ రెహమాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. భారత ఎయిర్‌లైన్ స్పైస్‌జెట్‌ను తన గగనతలం ఉపయోగించకుండా నిషేధించింది. గగనతలం అందుబాటులో లేకపోవడంతో, కోల్‌కతా నుండి గౌహతి, ఇంఫాల్‌కు కొన్ని విమానాలు ప్రస్తుతం ఎక్కువ మార్గాలను తీసుకోవలసి వస్తుంది. బకాయిలు చెల్లించని కారణంగా బంగ్లాదేశ్ తారిఖ్ రెహమాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. భారత ఎయిర్‌లైన్ స్పైస్‌జెట్‌ను తన గగనతలం ఉపయోగించకుండా నిషేధించింది. గగనతలం అందుబాటులో లేకపోవడంతో, కోల్‌కతా నుండి గౌహతి, ఇంఫాల్‌కు కొన్ని విమానాలు ప్రస్తుతం ఎక్కువ మార్గాలను తీసుకోవలసి వస్తుంది. ఇది విమాన సమయాలు, నిర్వహణ ఖర్చులను ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే నావిగేషన్ ఫీజులు సహా కార్యాచరణ, విధానపరమైన సమస్యలపై సంబంధిత అధికారులతో విమానయాన సంస్థ క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతోందని స్పైస్‌జెట్ ప్రతినిధి తెలిపారు. ఈ సమస్యలను పరిశ్రమకు సాధారణమని పేర్కొంటూ, త్వరిత పరిష్కారం కోసం నిర్మాణాత్మకంగా పనిచేస్తున్నారని, నిబంధనల ప్రకారం షెడ్యూల్ చేసిన విమాన సేవలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. షెడ్యూల్ చేసిన అన్ని విమానాలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయని స్పైస్‌జెట్ ప్రతినిధి పేర్కొన్నారు. ప్రయాణీకులకు ప్రస్తుతం ఎటువంటి ప్రభావం లేదు. అయితే, గగనతలం మూసివేయడం వల్ల, కొన్ని విమానాలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే, బకాయిల స్వభావం, మొత్తం వెంటనే స్పష్టంగా తెలియలేదు. స్పైస్ జెట్ విమానయాన సంస్థ సంబంధిత అధికారులతో సంప్రదిస్తున్నట్లు తెలిపింది. ఫ్లైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం, కొన్ని స్పైస్‌జెట్ విమానాలు బంగ్లాదేశ్ వైమానిక ప్రాంతాన్ని నివారించడానికి ప్రత్యామ్నాయ, సుదూర మార్గాల గుండా ప్రయాణిస్తున్నాయి. ఇదిలావుంటే, దీూజులో మధ్యాహ్నం ట్రేడింగ్ సమయంలో స్పైస్‌జెట్ షేర్లు దాదాపు 1 శాతం పడిపోయాయి. పెరుగుతున్న ఖర్చులు, ఒక సారి ఖర్చులను పేర్కొంటూ కంపెనీ ఇటీవల డిసెంబర్ 2025 త్రైమాసికంలో రూ.269.27 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు పేర్కొంది.

# రైళ్లలో ఎమర్జెన్సీ కోటా కింద సీట్లు ఎవరికి కేటాయిస్తారు?



అత్యవసర కోటా అనేది భారతీయ రైల్వేలు ప్రయాణికుల అత్యవసర అవసరాల కోసం రూపొందించిన ప్రత్యేక బుకింగ్ వ్యవస్థ. ఇది సాధారణ ప్రయాణికులకు కాకుండా, కేంద్ర మంత్రులు, న్యాయమూర్తులు, వీూలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి పరిమితంగా అందుబాటులో ఉంటుంది. భారతీయ రైల్వేలు ప్రయాణికుల అత్యవసర అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బుకింగ్ వ్యవస్థగా అత్యవసర కోటాను అమలు చేస్తున్నాయి. ఇది సాధారణ ప్రయాణికుల కోసం కాదు. అత్యవసర పరిస్థితుల్లో కొంతమంది నిర్దిష్ట వర్గాల వారికి మాత్రమే పరిమితంగా అందుబాటులో ఉంటుంది.

**అత్యవసర కోటా అంటే ఏమిటి?**

అత్యవసర కోటా అనేది కొన్ని రైళ్లలో, కొన్ని తరగతుల్లో ముందుగా రిజర్వ్ చేసిన సీట్లు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న అత్యంత ప్రాధాన్యత గల అభ్యర్థుల అత్యవసర ప్రయాణ అవసరాలను తీర్చేందుకు ఈ కోటాను ఉపయోగిస్తారు.

**ఎవరికి ఎలాట్ ఇస్తారు?**

కేంద్ర మంత్రులు, సుప్రీం కోర్టు, హై కోర్టు న్యాయమూర్తులు, పార్లమెంటు సభ్యులు, హై అఫీషియల్ రిక్విజిషన్ హోల్డర్లు, వీరికి కాకుండా మిగిలిన సీట్లను ఇతర అత్యవసర అభ్యర్థనలకు విడుదల చేయవచ్చు. ప్రభుత్వ విధి కోసం ప్రయాణం, కుటుంబంలో మరణం లేదా తీవ్ర అనారోగ్యం, అత్యవసర ఉద్యోగ ఇంటర్వ్యూ, ఎలా ఆమోదిస్తారు? ముందుగా HOR హోల్డర్లు, మంత్రులు, న్యాయమూర్తుల స్వీయ ప్రయాణాలకు కేటాయింపు, తర్వాత MP\T, ఇతర అధికారిక అభ్యర్థనలు, చివరగా అత్యవసర వ్యక్తిగత కేసులు.

# మీ జిల్లాలోనే ఆధార్ సెంటర్‌లో ఉద్యోగాలు..




ఆధార్ సేవలను మరింత బలోపేతం చేయడానికి ఆధార్ సూపర్‌వైజర్, ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామక ప్రక్రియ ద్వారా యువతకు తమ జిల్లాల్లోనే ఆధార్ సేవా కేంద్రాల్లో పనిచేసే అవకాశం లభిస్తోంది. SC విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్ రిక్రూట్‌మెంట్ 2026 కోసం ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ **csc.gov.in** ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానికంగా ఉండి ఉద్యోగం చేసుకోవాలనుకునే యువతకు ఇది శుభవార్తే. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జూజ **e-Governance Services India Limited** ఆధార్ సేవలను మరింత బలోపేతం చేయడానికి ఆధార్ సూపర్‌వైజర్, ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామక ప్రక్రియ ద్వారా యువతకు తమ జిల్లాల్లోనే ఆధార్ సేవా కేంద్రాల్లో పనిచేసే అవకాశం లభిస్తోంది.

**దరఖాస్తు వివరాలు**

**CSC** విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్ రిక్రూట్‌మెంట్ 2026 కోసం ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ **csc.gov.in** ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తుల చివరి తేదీ: మార్చి 10, 2026. గడువు తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేయడం మంచిది.

**ఖాళీల సంఖ్య**

ఈ నియామక డ్రైవ్‌లో భాగంగా మొత్తం 252 పోస్టులు భర్తీ చేయనున్నారు. జిల్లాల వారీగా ఖాళీలను విభజించి, స్థానిక యువతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆధార్ సేవా కేంద్రాల్లో ఆధార్ నమోదు, అప్‌డేట్‌లు, ఇతర సేవలు నిర్వహించాల్సి ఉంటుంది.

భర్తీ చేయనున్న పదవులు

ఆధార్ సూపర్‌వైజర్ ఆధార్ ఆపరేటర్

సూపర్‌వైజర్లు కేంద్రం మొత్తం కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. ఆపరేటర్లు ఆధార్ నమోదు, వివరాల సవరణ, అప్‌డేట్ వంటి పనులను నిర్వహిస్తారు.

అర్హతలు

కనీసం 12వ తరగతి ఉత్తీర్ణత లేదా 10వ తరగతి ం 2 సంవత్సరాల ఐటీఐ కోర్సు లేదా 10వ తరగతి ం 3 సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా

వయోపరిమితి

కనీస వయస్సు: 18 సంవత్సరాలు గరిష్ట వయస్సు: అధికారిక నోటిఫికేషన్ ప్రకారం వయస్సును గడువు తేదీ నాటికి లెక్కిస్తారు.

జీతం : ఆయా రాష్ట్రాల కార్మిక చట్టాల ప్రకారం.

స్థానిక భాష పరిజ్ఞానం : అభ్యర్థులు దరఖాస్తు చేస్తున్న జిల్లా స్థానిక భాషపై పట్టు ఉండాలి. ఇది ఆధార్ సేవా కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరం.

నియామక విధానం : ఈ నియామకం పూర్తిగా కాంట్రాక్ట్ ఆధారంగా ఉంటుంది. మొదట ఒక సంవత్సరానికి నియమించి, పనితీరు ఆధారంగా పొడిగింపు అవకాశం ఉంటుంది. ఈ ఉద్యోగం అనుభవ పరంగా కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధానం : అధికారిక వెబ్‌సైట్ https://csc.gov.in/ask ను సందర్శించండి.

**రాష్ట్రం, జిల్లా వారీగా ఉన్న ఖాళీలను పరిశీలించండి.**

మీ జిల్లాకు సంబంధించిన "Apply Now" లింక్‌పై క్లిక్ చేయండి. పేరు, మొబైల్ నంబర్, ఇమెయిల్, పాన్, జనన తేది వంటి వివరాలు నమోదు చేయండి. అవసరమైన పత్రాలు (రెజ్యూమ్, సంబంధిత సర్టిఫికెట్) అప్‌లోడ్ చేయండి. క్యాప్చా నమోదు చేసి ఫారమ్ సబ్మిట్ చేయండి. భవిష్యత్తు అవసరాల కోసం దరఖాస్తు ఫారమ్ ప్రింట్ తీసుకోండి. ఇది యువతకు మంచి ఉపాధి అవకాశం. ఆసక్తి ఉన్నవారు వెంటనే దరఖాస్తు చేయండి.

# 6 గంటల్లో రూ.6 లక్షల కోట్లు ఆవిరి!

## స్టాక్ మార్కెట్ ఇంతలా ఎందుకు కుప్పకూలింది?



భారత స్టాక్ మార్కెట్లు మరోసారి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ పతనం లక్షల కోట్ల పెట్టుబడిదారుల సంపదను హరించింది. లాభాల బుకింగ్, అమెరికా ఫెడ్ రిజర్వ్ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు. దేశీయ స్టాక్ మార్కెట్లు మరోసారి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ దాదాపు 1,100 పాయింట్లు పడిపోగా, నిఫ్టీ 50 రోజువారీ కనిష్టం 25,567.75కి చేరింది. ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో భారీ అమ్మకాలు జరిగి పెట్టుబడిదారులు సుమారు రూ.6 లక్షల కోట్లు కోల్పోయారు. మార్కెట్ ఇంతలా ఎందుకు పడిపోయింది ఇప్పుడు చూద్దాం.. లాభాల బుకింగ్ ప్రభావం.. ఇటీవల వరుసగా లాభాలు నమోదు చేసిన తర్వాత ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగారు. బడ్జెట్ RBI విధానం త్రైమాసిక ఫలితాల ప్రభావం తగ్గడంతో కొత్త పాజిటివ్ ట్రిగ్గర్లు లేకపోవడం మార్కెట్‌ను బలహీనపరిచింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ అనిశ్చితి.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ భవిష్యత్ వడ్డీ రేట్లపై స్పష్టత లేకపోవడం గ్లోబల్ మార్కెట్లలో ఆందోళన కలిగించింది. రేట్లు ఎక్కువ కాలం ఉన్నతంగా ఉంటే విదేశీ పెట్టుబడులు ఎమర్జింగ్ మార్కెట్ల నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉంది. భౌగోళిక ఉద్రిక్తతలు.. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల వార్తలు పెట్టుబడిదారుల్లో జాగ్రత్త భావన పెంచాయి. అనిశ్చితి పెరిగితే మార్కెట్లు సాధారణంగా రిస్క్ తగ్గించే దిశగా కదులుతాయి. పెరిగిన ముడి చమురు ధరలు.. బ్రెంట్, WTI క్రూడ్ ధరలు పెరగడం భారత్‌కు ప్రతికూల సంకేతం. దేశం పెద్ద చమురు దిగుమతిదారుగా ఉండటంతో రూపాయి, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరుగుతుంది.



## హామీలు గాలికొదిలేసి,

# రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారా..?

**చెల్లూరులో టిడిపి నాయకుల ఆరోపణల పై వైకాపా నేతల సెటైర్లు - ఎమ్మెల్సీ తోట వ్యాఖ్యలు వక్రీకరించి దేవాలయాలపై రాజకీయం చేస్తున్నారు**
**కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎంత వరకూ అమలు చేసారు - సెంటు స్థలమైనా మంజూరు చేసారా ? కొత్త ఫించన్లు ఎన్ని ఇచ్చారు**
**అధికారంలో ఉన్నంత మాత్రాన ఏం చెప్పినా నిజమై పోదు వాస్తవాలు ప్రజలకు తెలుసు - టిడిపి నేతలు చేస్తున్నది ముమ్మాటికీ కక్ష్య సాధింపు చర్యలే**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** టిడిపి నాయకులు పొందిన అధికారాన్ని వైసీపీ కార్యకర్తలపై కక్ష్య సాధింపు చర్యలకు కాక, ప్రజలకు మేలు చేయడానికి ఉపయోగించాలని వైఎస్సార్సీపీ కార్యకర్తలు హితవు పలికారు. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చెల్లూరు గ్రామం లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల విషయంలో గ్రామ టిడిపి నాయకులు బుధవారం గతంలో జరిగిన సంఘటనలపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని ఖండిస్తూ, టిడిపి నేతలు చేస్తున్నది ముమ్మాటికీ కక్ష్య సాధింపు చర్యలేనని వివరించారు. టిడిపి నేత దేవు వెంకట్రాజు ( శ్రీను) చేసిన ఆరోపణలకు వైకాపా మండపేట నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు పాలిక శ్రీను వివరణ నిస్తూ. మామిడిశెట్టి రామకృష్ణ అనే వ్యక్తి విషయంలో తన ప్రమేయం లేదని అతనే ఒక బ్రోకర్ కి మట్టిని అమ్మగా వారికి,వారికి పడక మైనింగ్ అధికారులకు పిర్యాదు చేసుకున్నారని దీనిలో తన ప్రమేయం లేదని, ఇది కేవలం టిడిపి నాయకులు బురద చల్లే ప్రయత్నం లో భాగమేనన్నారు. అదే నిజమైతే ఎం.ఎల్.సీ తోట త్రిమూర్తులు ను తాను తీసుకుని వచ్చి ధైర్యంగా ప్రెస్ మీట్ ఏర్పాటు చేసినట్లు, మీరెందుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ను పిలిపించలేదని ప్రశ్నించారు. వెంటూరు టిడిపి నాయకులు కోరింగ కాలువ నుండి తమ సొంత ప్రాంతాలకు మట్టిని మూడు, నాలుగు రోజుల క్రితం తరలించారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి చెల్లూరు లోని రామాలయాలకు తరలించారని ఆరోపిస్తూ రాజకీయాలలోనికి దేవాలయాలను తీసుకు వచ్చే ప్రయత్నం చేయడం టిడిపి నేతలకు అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. చెరువుగట్టు మట్టిని సొంత స్థలంలోనికి విని యోగించుకున్నారని చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని స్మశానంలోనికి ఆ మట్టిని తరలించారని దానికి గ్రామంలోని ట్రాక్టర్, జెసిబి యజమానులే సాక్ష్యం అని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సంఘటన విషయంలో రశీదు ను చూపిస్తూ, అధికారులు జరిమానా విధించారని చెప్పడం కూడా అలాంటిదేనని, అధికారులను ఒత్తిడికి గురిచేసి చెల్లూరు కు తీసుకొచ్చారని వారు సైతం దీనిలో వాస్తవం లేదని తెలుసుకుని విచారం వ్యక్తం చేసారని ఇకనైనా అవాస్తవాలు మాని వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు. అనంతరం గ్రామ సర్పంచ్ పాలికి రాఘవ భర్త గోవిందు మాట్లాడుతూ టిడిపి నాయకులు కక్ష సాధింపు చర్యలు చేయరని చెప్పుకోవడం హాస్యాస్పదమని, రాష్ట్రంలో పార్టీ అధికారం చేపట్టిన వెంటనే పంచాయతీలో పొట్టకూటి కోసం పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగుస్తులను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి పై ఒత్తిడి తీసుకురావడం కక్ష సాధింపు చర్య కాదా? అని ప్రశ్నించారు. వైకాపా నేత పెంకే నాగ శివరామకృష్ణ ముఖ్యమంత్రి సహాయ నిధికి సహాయం కావాలని కార్యకర్త ద్వారా అర్జీ పెడితే బ్రాందీ షాపు ఊరి చివరకు వెళ్లిపోవాలని సంతకం పెట్టిన వ్యక్తి కనుక ఇతనికి ముఖ్యమంత్రి సహాయ నిధి సహాయం అందించడం కుదరదని గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా చెప్పుకుంటున్న చుంద్రురాజు తిరస్కరించారని, ఇది కక్ష సాధింపు చర్య కాదా? అని ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్ష నేత అయినప్పటికీ టిడిపి నేత నూనె ఏసు బాబు కు ఇంటికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేసిన ఘనత వైయస్సార్సీపి నాయకులకి చెందుతుం దని గుర్తు చేశారు. అభివృద్ధి చేసేసామని చెప్పుకుంటున్న టిడిపి నాయకులు చేసిన అభివృద్ధి కోసం తడుముకోవాలని, ప్రజల వద్దకు వెళితే వైఎస్ఆర్ సిపి చేసిన అభివృద్ధి కోసం వారే చెబుతారని వివరించారు. సంక్షేమం అంటేనే జగన్మోహన్ రెడ్డి అనే విధంగా సుమారుగా 36 లక్షల మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయడమే కాక, ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన ఘనత వైఎస్ఆర్ సిపి కి ఉందని, మీరు చేసిన అభివృద్ధి, సంక్షేమం పేపర్ పై ఉంటే వైఎస్ఆర్సిపి చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని, అధికారం చేపట్టిన 20 నెలల సమయంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, పింఛన్లు ఎన్ని మంజూరు చేశారని, 50 సంవత్సరాలకే ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు పింఛన్లు ఇస్తామని చెప్పిన వాగ్దానం ఏమైందని గుర్తు చేశారు. 19 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని చెప్పిన హామీ ఎటు పోయిందని నిలదీస్తూ ఎంతమందికి ఈ సంక్షేమం అందించారో చెబితే తమతో పాటు ప్రజలు కూడా వాస్తవాలు తెలుసుకుంటారని అన్నారు. అధికారంలో ఉన్నంత మాత్రమే ఏది చెప్పినా నిజమని ప్రజలు నమ్మరని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కక్ష సాధింపు తో అధికార దుర్వినియోగానికి కాక, ప్రజలకు మేలు చేయడానికి ఉపయోగించాలని హితవు పలికారు. తదుపరి మండపేట నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బొడ్డపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి కి చెందిన సీనియర్ నాయకులు పాలిక శ్రీను పై అక్రమ మట్టి తవ్వకాలు అని టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణలు కేవలం కక్ష సాధింపు చర్యలేనని, రైతులు పొలంలో మట్టిని చదును చేసుకోవాలి అంటే టిడిపి నాయకుల పర్మిషన్ ఎందుకు తీసుకోవాలో చెప్పాలన్నారు. రైతులను భయపెట్టి వారి వద్ద నుండి డబ్బులు అక్రమంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శనం ఇదేనా అన్నారు. మాజీ సర్పంచ్ రాజ్ కుమార్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఆయన అధికారంలో ఉన్నప్పుడు స్మశానానికి రహదారి వేయలేకపోయా రని, వైకాపా అధికారం లోకి వచ్చాక సర్పంచ్ పాలిక రాఘవ గోవిందు ఆ పనిని పూర్తి చేసారని గుర్తు చేశారు. రూ.5.5 కోట్లతో చింతల తోటలో ఏడు రహదారుల పనులు ప్రారంభించారన్నారు. మండపేటలో సైతం గొల్లపుంత కాలనీ, స్మశానాలకు గ్రావెల్ తరలించడానికి మండపేటలో ఎవరు పర్మిషన్ తీసుకున్నారని అధికారంలో ఉన్నారు కాబట్టి మీరు ఏం చేసినా చెల్లుతుంది అనుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. వైఎస్ఆర్సిపి 11 సీట్లు గెలిచిందని ఎద్దేవా చేస్తున్న వారు రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం ఓట్లు సాధించిన ఏకైక పార్టీ వైఎస్ఆర్సిపి అని, టీడీపీ ఒంటరిగా పోటీ చేస్తే అన్ని ఓట్లు వస్తాయా అని ప్రశ్నిస్తూ టిడిపి నాయకులు ఏర్పాటుచేసిన సమావేశం ను కూటమి నాయకుల సమావేశంగా చెప్పుకోవడం హాస్యాస్పదమని, కేవలం టిడిపి నాయకులు తప్ప ఇతర కూటమి నాయకులు కనబడరెందుకని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టి ఏ ప్రభుత్వం నిలబడదని, రెండు సంవత్సరాలు పూర్తయిపోగా ఇంకా రెండు సంవత్సరాలు నరకాసుర పాలన కొనసాగుతుందని తరువాత ప్రజలు తీర్పు చెప్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పలివెల వెంకటలక్ష్మి, రామకృష్ణ, చిక్కాల శ్రీరాములు, పంతగడ శ్రీనివాస రావు, పిల్లి సుబ్రహ్మణ్యం, ఎం.వి.గోపి, కొండేపూడి సూరిబాబు, కసే శ్రీనివాస్, వుల్లింగి చిన్న, వెలగల దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసంతృప్తిగా ఉన్నా 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి దృష్టి సారించాలి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రభుత్వానికి వినతి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గం లో పెరుగుతున్న జనాభా దృష్ట్యా తమకు అసంతృప్తిగా ఉన్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇప్పటి వరకు తమకు 30 పడకల ఆసుపత్రి మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. చుట్టు పక్కల అనేక గ్రామాల నుండి ప్రజలు వైద్యం కోసం మండపేట రావడం జరుగుతుందని, అయితే ఆ ఆసుపత్రి సరిపోక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నాబార్డు నిధులు ఐదున్నర కోట్లు, స్థానిక మున్సిపల్ నిధులతో కలిపి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం మొదలు పెట్టినా దానిని మాత్రం గాలికి వదిలేసారన్నారు. అసలు 100 పడకల ఆసుపత్రి అనేదే మంజూరుకు నోచుకోలేదని, ఇదంతా గత ప్రభుత్వ నిర్వాకమని పేర్కొన్నారు. అయితే ఈ విషయాలన్నింటినీ తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో ఎన్నికలకు ముందే ఆయన మండపేట వచ్చిన సందర్భంలో చెప్పడం జరిగిందన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ఆసుపత్రి నిర్మాణానికి హామీ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత రోగులు అత్యధికంగా ఉన్న నేపథ్యంలో తమకు ఒక డయాలసిస్ సెంటర్ కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే వేగుళ్ళ అసెంబ్లీలో సభ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను సరిచేస్తున్నాం

**ప్రజలకు అందుబాటులోకి కమ్యూనిటీ హాల్స్ - 4వ వార్డు సచివాలయం వేరే భవనాల్లోకి స్వర్ణ వార్డు కార్యాలయాలుగా మార్పు**
**ఈ వార్డులో మొత్తం రూ.నాలుగున్నర కోట్ల పనులు - కమ్యూనిటీ హాలు మరమత్తు పనులకు ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణ యాలను కూటమి ప్రభుత్వం సరిచేస్తోందని, ప్రజల అవసరాలను తీర్చే విధంగా పనిచేస్తోందని రాజమహేంద్ర వరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 4వ వార్డులో కమ్యూ నిటీ హాలు మరమత్తు పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ గతంలో అన్ని వార్డుల్లో పేద బడుగు వర్గాల ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీహాల్స్‌ని గత వైసిపి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో సచివాల యాలుగా మార్చేసి ప్రజలకు ఇబ్బం దులు సృష్టించిందని వాపోయారు. ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా ఇలా చేయడం దారు ణమన్నారు. ఇదే వార్డులో ఖాళీగా ఉన్న భవనాల గురించి నక్కా చిట్టి బాబు తమ దృష్టికి తీసుకొచ్చి, సచివాలయాన్ని అక్కడికి తరలించి, కమ్యూనిటీ హాలును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ఈ విషయం అధికా రులతో చర్చించినపుడు మంచి నిర్ణయం అన్నారన్నారు. దాంతో వేరే భవనాల్లోకి స్వర్ణ వార్డు కార్యాలయాలుగా తరలించినట్లు ఎమ్మెల్యే వాసు వివరించారు. ఈ కమ్యూనిటీ హాలుని మరమత్తులు చేయడానికి రూ. 23 లక్షలతో అంచనాలు రూపొందించి, ఫ్లోరింగ్, వాష్ బేసిన్స్ తో సహా అన్నింటినీ చేపట్టడానికి ఇప్పుడు శంకుస్థాపన చేశామని తెలిపారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ఇక్కడ బలహీన వర్గాలకు చిన్న చిన్న వేడుకలకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇది మా నాయకుల ఆలోచన విధానమని, మరి వైసిపి నాయకుల విధానం ఉన్నదాన్ని నిరుపయోగంగా చేయడమని ఆయన ఎద్దేవా చేసారు. ప్రజలు ఈ విషయాలను గమనించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ వార్డులో 42లక్షల 50వేల రూపాయల పనులు పూర్తిచేశామన్నారు. రూ 19లక్షల పనులు నడుస్తున్నాయన్నారు. ఇప్పుడు రూ 23లక్షల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కోటి 80లక్షలతో సూర్య రెస్టారెంట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు రోడ్డు వేసే పని త్వరలో చేపడతామన్నారు. ఇవి కాకుండా పుష్కరాల పనులలో భాగంగా కోటి 60లక్షల పనులు చేపడతామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. మొత్తంగా రూ 4న్నరకోట్లతో ఈ వార్డులో అభివృద్ధి పనులుగ ఆయన వివరించారు. తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి వాసు విజయం సాధించిన తర్వాత 4వ వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మూడు సచివాలయాలు, కల్వర్టుల ప్యాచ్ వర్కులు చేసారని, అలాగే గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంగా సచివాలయం కోసం వినియోగించిన కమ్యూనిటీ హాలు కు మళ్ళీ పూర్వ వైభవం కల్పించడానికి మరమ్మత్తులు చేపట్టాలని కోరిన వెంటనే అంగీకరించి, రూ 23లక్షల అంచనాతో పనులు చేయించడానికి శంకుస్థాపన చేయడం అభినందనీయమని వివరించారు. వార్డులో అన్ని రకాల పనులు చేపడుతున్న ఎమ్మెల్యే వాసుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశీ నవీన్ కుమార్, దొండపాటి సత్యంబాబు, నక్కా దేవి వర ప్రసాద్, యాళ్ల శ్రీనివాసరావు, గూటాల సంజీవరావు, గుత్తుల రమేష్, అప్పిరెడ్డి కుమార్, కొండిశెట్టి రామకృష్ణ, బొట్టా వీరబాబు, లంక మణికంఠ, గుత్తుల లోకేష్, ఎం సత్యనారాయణ, కాంట్రాక్టర్ మార్గాని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్యకు శ్రద్ధాంజలి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఐలాపురం వెంకయ్య మృతి కుమ్మర శాలివాహనులకు తీరనీ లోటనీ ఆంధ్రప్రదేశ్ కుమ్మర సాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలపర్తి వేమన అన్నారు. గురువారం రాజమహేంద్ర వరం, మోరంపూడిలో కుమ్మర శాలివాహనులు ఐలాపురం వెంకయ్య చిత్రపటం వద్ద నివాళు లర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి శాలివాహన సంఘం అధ్యక్షులు మెరుగుమల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైరెక్టర్ వేమన మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులకు ఫెడరేషన్ తీసుకువచ్చింది ఐలాపురం వెంకయ్యనని గుర్తు చేశారు .ఆయన కుమ్మర శాలివాహములకు ఓ బలమైన శక్తిగా ఆయన విజయవాడలో కార్యక్రమాలు నిర్వహించేవారు అని కొనియాడారు. ఈ సమావేశంలో సభ్యులు రెండు నిమిషాలు మౌనం వహించి శ్రద్ధాంజలి ఘటించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పందురి రామారావు, మండా నాగేశ్వరరావు ,టీవీ రావు, పివిపి రాజు ,వానపల్లి శ్రీనివాసు, కడియపు రామలింగం, కొండేటి రమణ పేరూరి శేషారావు, పేరూరు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక ఎలుకలు నిర్మూలనకు చర్యలు



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలంలో అన్ని రైతు సేవా కేంద్రల పరిధిలో సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. మారేడుబాకలో సామూహిక ఎలుకల ముందు పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, డిఆర్ సిపిడి రాజశేఖర్ ఆలమూరు ఏడిఏ సిహెచ్ కెవి చౌదరి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు. గ్రామ నాయకులు రాయుడు గంగరాజు, ముత్యాల అన్నవరం, వ్యవసాయ విస్తరణ అధికారి వనము బాలకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ బాజీ రైతులు పాల్గొన్నారు.

# వాడపల్లి స్వామిని దర్శించుకున్న శేఖర్ మాస్టర్



**రావులపాలెం, విశ్వంవాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి వారిని సినీ పరిశ్రమలో ప్రముఖ డాన్స్ మాస్టర్ (కోరియోగ్రా ఫర్) శేఖర్ మాస్టర్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనా నంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు శేఖర్ మాస్టర్ కుటుంబ సభ్యులకు శ్రీస్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు.

# ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వం కల్పించిన ప్లాట్ల లేఅవుట్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. గురువారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారానికి గాను ఏవీ అప్పారావు రోడ్డు, ఎస్.బి.ఐ. కాలనీ, కోరుకొండ రోడ్డులోని పలు కాలనీలలో పర్యటించి అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ ఆర్ ఎస్)కు ఏప్రిల్ 23 వరకు, బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బిపిఎస్-2025) కు మార్చి 11 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను అధికారులు పరిశీలించి వెంటనే అనుమతి మంజూరు చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా సూచించారు. ఏప్రిల్ 23 అనంతరం అనధికారిక లేఅవుట్లలో గల ప్లాట్ల యందు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, డీసీపీ పి.శ్రీనివాస్, ఏసీపీలు కొండలరావు, శ్రీనివాసరావు, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

## డాక్టరేట్ అవార్డ్ గ్రహీత అంగర రమేష్‌ను

# అభినందించిన ప్రముఖులు

**రమేష్ లాంటి మంచి వ్యక్తులు సమాజంలో అరుదు**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** డ్రీమ్ స్కూల్స్ అధినేత డాక్టరేట్ గ్రహీత అంగర రమేష్‌ను అభినందించిన.. డిసిసిబి మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం ఉదయం స్థానిక ధవలేశ్వరం డ్రీమ్స్ స్కూల్స్ అధినేత అంగర రమేష్ కు డాక్టరేట్ లభించినందుకు డిసిసిబి మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ధవళేశ్వరం నందు రమేష్ ను కలిసి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆకులు వీర్రాజు మాట్లాడుతూ డ్రీమ్స్ స్కూల్స్అధినేత అంగర రమేష్ కు మరిన్ని ఉన్నత బిరుదులు రావాలని రమేష్ లాంటి మంచి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వికలాంగుల సెల్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, స్థానిక వైసీపీ నాయకులు, ముత్యాల అనంతబాబు, నంబూరి రవి, తదితరులు పాల్గొన్నారు.

సినీ వాయిస్ CINEMA

రెడ్ కార్పెట్‌పై బ్లడీ మేరీ లుక్‌లో

# లెదర్ కోర్సెట్ డ్రెస్ మెరిసిన గ్లోబల్ బ్యూటీ..



గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆ దేశీ గర్ల్ మరోసారి అంతర్జాతీయ వేదికపై సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. హాలీవుడ్ రెడ్ కార్పెట్ మీద ఆమె అడుగు పెడితే కెమెరా కళ్లన్నీ ఆమెవైపే మళుతాయి. ఫిబ్రవరి 17న లాస్ ఏంజెల్స్‌లో జరిగిన తన కొత్త సినిమా వరల్డ్ ప్రీమియర్ వేడుకలో ఆమె ధరించిన దుస్తులు, ఆమె ఆహార్యం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఆమె ఒకప్పుడు మిస్ వరల్డ్. బాలీవుడ్ ను ఏలిన తర్వాత ఇప్పుడు హాలీవుడ్ లో తన సత్తా చాటుతోంది. ఇటీవల విడుదలైన తన కొత్త యాక్షన్ సినిమా 'ద బ్లఫ్' ప్రీమియర్ వేడుకలో ఆమె ఒక యోధురాలిలా కనిపిస్తూనే, హై ఫ్యాషన్ తో అందరినీ మంత్రముగ్ధులను చేసింది. సినిమాలో 'బ్లడీ మేరీ' అనే పవర్ ఫుల్ పాత్రను పోషించిన ఆమె, ఆ పాత్రలోని గాంభీర్యాన్ని రెడ్ కార్పెట్ మీదకు తీసుకొచ్చింది. ఆ గ్లోబల్ ఐకాన్ మరెవరో కాదు.. ప్రియాంక చోప్రా. తన అద్భుతమైన డ్రెస్సింగ్ స్టైల్ తో లాస్ ఏంజెల్స్ వీధుల్లో సందడి చేసిన ప్రియాంక లుక్ విశేషాలేంటో వివరంగా తెలుసుకుందాం..

### లెదర్ కోర్సెట్ మ్యాజిక్

ఈ వేడుక కోసం ప్రియాంక డార్క్ బ్రౌన్ కలర్ లో ఉన్న ఒక విలక్షణమైన గౌనును ఎంచుకుంది. ఈ డ్రెస్ లో ప్రధాన ఆకర్షణ దాని పైభాగం. చాక్లెట్ టోన్ లో ఉన్న లెదర్ బ్రెస్ట్‌ప్లేట్ ఆమె శరీర సౌష్టవానికి తగ్గట్టుగా రూపుదిద్దుకుంది. సినిమాలో ఆమె పోషించిన ఎర్సెల్ 'బ్లడీ మేరీ' బోడెన్ పాత్రకు గుర్తుగా ఈ లెదర్ కోర్సెట్ మీద ప్రత్యేకమైన డిజైన్లను చెక్కారు. దీనికి ఇరువైపులా ఉన్న బకిల్ డీటెయిల్స్ ఆమెకు ఒక షార్ప్ మరియు బోల్డ్ లుక్ ఇచ్చాయి. పైన లెదర్ తో పవర్ ఫుల్ గా కనిపించిన ఈ డ్రెస్, కిందకి వచ్చేసరికి చాలా సాఫ్ట్ గా, ఫ్లోయీ ఫ్యాబ్రిక్ తో డిజైన్ చేశారు. నడుము భాగంలో ఉన్న డ్రాపింగ్స్ ఆమె లుక్ కు ఒక వింటేజ్ స్టైల్ ను తెచ్చాయి. ఒక వైపు ఉన్న హై-స్లిట్ ఆమె టోన్డ్ లెగ్స్ ను హైలైట్ చేస్తూ గ్లామర్ ను జోడించింది. గౌను వెనుక భాగంలో ఉన్న పొడవైన క్లాత్ ఆమె నడుస్తున్నప్పుడు రెడ్ కార్పెట్ పై ఒక రాణిలా కనిపించేలా చేసింది. ప్రియాంక తన లుక్ కు తగ్గట్టుగా ఆకర్షణీయమైన సిల్వర్ చోకర్ నెక్లెస్ ధరించింది. దాని మధ్యలో ఉన్న పెద్ద డార్క్ స్టోన్ హైలైట్ గా నిలిచింది. పాదాలకు బ్రౌన్ కలర్ ఓపెన్-టో హీల్స్ ధరించి తన డ్రెస్ కలర్ తో మ్యాచ్ చేసింది. ఆమె మేకప్ విషయానికి వస్తే.. ఎర్తీ టోన్స్ తో కూడిన రోజ్-బ్రౌన్ లిప్ స్టిక్, బ్రౌన్ ఐషాడోతో ఆమె ముఖం వెలిగిపోయింది. ప్రియాంక తన జుట్టును లూజ్ వేవ్స్ లా వదిలేసింది. తన సహజమైన నలుపు రంగు జుట్టుకు మధ్య మధ్యలో డార్క్ రెడ్ హైలైట్స్ ఇవ్వడం వల్ల ఆమె లుక్ మరింత ఎడ్జీగా, పవర్ ఫుల్ గా మారింది. సినిమాలో ఆమె పోషించిన మొరటుగా ఉండే పైరేట్ పాత్రకు ఇది ఒక స్టైలిష్ వెర్షన్ లా అనిపించింది. మొత్తానికి ప్రియాంక చోప్రా తన డ్రెస్సింగ్ తో 'ద బ్లఫ్' సినిమా థీమ్ ను పక్కాగా ప్రతిబింబించింది. అంతర్జాతీయ వేదికలపై భారతీయ నటి ఇలాంటి బోల్డ్, పవర్ ఫుల్ లుక్స్ తో రాణించడం ఆమె అభిమానులకు ఎంతో గర్వకారణం.

కాస్మెటిక్ సర్జరీలపై జాన్వీ కపూర్ సంచలన వ్యాఖ్యలు..

# 'బఫెలో-ప్లాస్టీ', అందం కోసం చేసిన వాటిపై క్లారిటీ!



ఆమె ఒక స్టార్ హీరోయిన్, స్టార్ ప్రొడ్యూసర్ కూతురు. వెండితెరపై తన తల్లి సృష్టించిన ప్రభంజనాన్ని తలపిస్తూ సినిమాల్లోకి అడుగుపెట్టింది. కానీ ఆమె ముఖకవళికలు, ముక్కు ఆకారం, పెదవుల తీరుపై విమర్శకుల నుంచి ఎప్పుడూ ఏదో ఒక విమర్శ వస్తూనే ఉంటుంది. రైనోప్లాస్టీ, లిప్ ఫిల్లర్స్ వంటి సర్జరీలు చేయించుకుందని నెటిజన్లు ఫోటోలు పెట్టి మరీ ట్రోల్ చేస్తుంటారు. సాధారణంగా ఇలాంటి విషయాలపై హీరోయిన్లు మౌనంగా ఉంటారు. కానీ ఈమె మాత్రం అందుకు భిన్నంగా 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' షోలో తన సర్జరీల గుట్టు విప్పింది. బఫెలో-ప్లాస్టీ వంటి వింత వార్తలపై ఆమె స్పందించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### నా అందం.. నా ఇష్టం

ఆ నటి మరెవరో కాదు.. అతిలోక సుందరి తనయ జాన్వీ కపూర్. సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడూ 'పర్ఫెక్ట్' గా కనిపించాలనే ఒత్తిడి ఉంటుందని జాన్వీ అంగీకరించింది. సోషల్ మీడియా ప్రభావం వల్ల ప్రతి ఒక్కరూ ఇతరుల రూపం గురించి తీర్పులు ఇస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సర్జరీల గురించి మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ ఏ విషయాన్ని దాచాలని అనుకోను. మీకు ఏది సంతోషాన్ని ఇస్తే అది చేయండి అనే తత్త్వం నాది. పర్ఫెక్ట్ గా కనిపించాలనే ఆలోచనను యువతులకు నేను రుద్దాలనుకోవడం లేదు. మీరు ఎలా ఉండాలనుకుంటున్నారో అది మీ వ్యక్తిగత నిర్ణయం" అని జాన్వీ స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో తనపై వస్తున్న కొన్ని వింతైన వార్తలను చూసి జాన్వీ నవ్వుకుంది. ముఖ్యంగా 'బఫెలో-ప్లాస్టీ' అనే పేరుతో కొందరు వైద్యులు చేస్తున్న వీడియోలపై ఆమె ఘాటుగా స్పందించింది. "నేను నా అందం కోసం ఏది చేసినా చాలా తెలివిగా, పద్ధతిగా, తక్కువ మోతాదులోనే చేశాను. ఇందులో నాకు మా అమ్మ మార్గదర్శకత్వం ఎప్పుడూ ఉండేది. ఒకవేళ నన్ను చూసి ఎవరో ఒక చిన్నారి కూడా ఇలాంటి పనులు చేయాలని ప్రయత్నించి ఏదైనా తప్పు జరిగితే అంతకంటే దారుణం మరొకటి ఉండదు. అందుకే ఇలాంటి విషయాల్లో పారదర్శకత ఉండాలని నేను కోరుకుంటున్నాను" అని జాన్వీ చెప్పుకొచ్చింది.

### కాజోల్ మద్దతు..

ఈ షోలో పాల్గొన్న సీనియర్ నటి కాజోల్ కూడా జాన్వీ మాటలతో ఏకీభవించింది. తన కూతురు నైసా దేవగణ్ పై కూడా ఇలాంటి విమర్శలే వస్తున్నాయని ఆమె గుర్తు చేసుకుంది. "నైసా, నేను కలిసి 25 సర్జరీలు చేయించుకున్నామని కొన్ని సైట్లు కథనాలు రాస్తున్నాయి. అసలు ఆ 25 పనులు ఏంటో నాకు అర్థం కావడం లేదు" అని కాజోల్ ఎద్దేవా చేసింది. దేవుడు మనల్ని ఒకలా సృష్టిస్తే, మనకు నచ్చినట్లు కనిపించడానికి మేకప్ ఉంది.. అది ఒక వ్యక్తిగత ఇష్టమని కాజోల్ అభిప్రాయపడింది. జాన్వీ కపూర్ ఇటీవల 'సన్నీ సంస్కారికి తులసి కుమారి', 'హోమ్ బౌండ్' వంటి సినిమాల్లో మెరిసింది. ప్రస్తుతం ఆమె తెలుగులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. ఎన్టీఆర్ సరసన 'దేవర' సినిమాతో ఇప్పటికే టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన ఈ సుందరి, ఇప్పుడు తన గ్లామర్ తో పాటు తన నిజాయితీతో కూడిన మాటలతో అందరినీ ఆకట్టుకుంటోంది.

# చరిత్ర సృష్టించిన లేడీ రోహిత్..

తొలి మహిళా ప్లేయర్‌గా రికార్డ్..



2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హర్మన్‌ప్రీత్ మూడు ఫార్మాట్లలోనూ సుదీర్ఘ కెరీర్ నిర్మించుకుంది. ఆమె రికార్డు టాలీ లో 6 టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20ఐలు ఉన్నాయి. ఈ మైలురాయి మ్యాచ్ ఆమెకు టీ20ఐ ఫార్మాట్‌లో 189వ మ్యాచ్ కావడం విశేషం. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గురువారం చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియాతో మనూకా ఓవల్‌లో జరిగిన రెండో టీ20ఐలో ఆమె మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. ఇది ఆమెకు భారత్ తరఫున 356వ అంతర్జాతీయ మ్యాచ్. ఈ మ్యాచ్‌తో న్యూజిలాండ్ దిగ్గజం సుజీ బేట్స్ (355 మ్యాచ్‌లు) రికార్డును హర్మన్‌ప్రీత్ అధిగమించింది. ఈ ఘనతతో మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో హర్మన్‌ప్రీత్ కౌర్ అగ్రస్థానంలో నిలిచింది. ఆమె తర్వాత సుజీ బేట్స్, ఆస్ట్రేలియా స్టార్ ఎలిస్ పెర్రీ (349 మ్యాచ్‌లు), మాజీ భారత కెప్టెన్ మిథాలీ రాజ్ (333 మ్యాచ్‌లు) ఉన్నారు. ఇంగ్లండ్ లెజెండ్ చార్లెట్ ఎడ్వర్డ్స్ 309 మ్యాచ్‌లతో టాప్--5 జాబితాలో నిలిచింది. ఈ రికార్డు ఇప్పటికే ఘనతలతో నిండిన హర్మన్‌ప్రీత్ కెరీర్‌కు మరో మైలురాయి. ఆమె నాయకత్వంలో భారత్ 2025లో తొలి వన్డే వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. ఇటీవల ఇంగ్లండ్‌లో టీ20ఐ సిరీస్ విజయం కూడా సాధించింది. ఈ నెల ప్రారంభంలో భారత క్రికెట్‌కు అందించిన విశిష్ట సేవలకు గాను హర్మన్‌ప్రీత్‌కు పద్మశ్రీ పురస్కారం కూడా లభించింది. మూడు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ పర్యటనలో మూడు వన్డేలు, ఒక టెస్ట్ కూడా ఉన్నాయి. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన తొలి టీ20ఐలో డీఎల్‌ఎస్ విధానంలో భారత్ 21 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఈ విజయంలో అరుంధతి రెడ్డి కెరీర్ బెస్ట్ బౌలింగ్ ప్రదర్శన కీలక పాత్ర పోషించింది. అరుంధతి రెడ్డి 4/22 గణాంకాలతో ఆస్ట్రేలియాను 18 ఓవర్లలో 133 పరుగులకే కట్టడి చేసింది. జార్జియా వేర్‌హామ్ (30), ఫీబీ లిచ్‌ఫీల్డ్ (26), ఎలిస్ పెర్రీ (20) స్వల్పంగా పోరాడినా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ కుప్పకూలింది. ప్రత్యుత్తరంగా షఫాలీ వర్మ-స్మృతి మంధాన జోడీ 5.1 ఓవర్లలో 50 పరుగులతో శుభారంభం ఇచ్చింది. అయితే భారీ వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోవడంతో డీఎల్‌ఎస్ ప్రకారం భారత్ విజేతగా ప్రకటించబడింది. ఈ గెలుపుతో భారత్ మల్టీ-ఫార్మాట్ సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.

# టీ20 ప్రపంచ కప్‌లో అత్యంత ధనవంతుడైన క్రికెటర్ ఎవరు?



టీ20 ప్రపంచ కప్ ఆటగాళ్ళు తమ క్రీడా కెరీర్‌లోనే కాకుండా వారి సంపాదనలో కూడా గణనీయమైన రికార్డులు సృష్టించారు. ఐపీఎల్, ఎండార్స్‌మెంట్‌ల ద్వారా అపారమైన సంపదను సంపాదించిన ఆస్ట్రేలియాకు చెందిన గ్లెన్ మాక్స్‌వెల్ 10 మంది ధనవంతులైన క్రికెటర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. భారత స్టార్లు హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా రూ.18 కోట్లు ఫీజు తీసుకునే సంజు సామ్సన్ కూడా ఉన్నారు. క్రికెట్ అభిమానులలో టీ20 ప్రపంచ కప్ ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. మైదానంలో ఆటగాళ్ల అద్భుతమైన ప్రదర్శనలతో పాటు, వారి నెట్ వర్త్ కూడా గణనీయమైన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే చాలా మంది ఆటగాళ్ళు అంతర్జాతీయ క్రికెట్, ఫ్రాంచైజ్ లీగ్‌లు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా అపారమైన సంపదను సంపాదిస్తున్నారు. ఆదాయాల పరంగా టాప్ 10 క్రికెటర్లు గణనీయమైన ఆర్థిక రికార్డులను సృష్టించారు. మాక్స్‌వెల్, హార్దిక్ ప్రస్థానం.. ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్వెల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ ఒప్పందాలు, ప్రపంచ టీ20 లీగ్‌లలో పాల్గొనడం వల్ల అతని నికర విలువ విపరీతంగా పెరిగింది. ఆసియా పిచ్‌లపై అతని అనుభవం జట్టుకు చాలా కీలకం. హార్దిక్ పాండ్యా భారత క్రికెట్‌లో అత్యంత విలువైన వ్యక్తులలో ఒకరిగా పేరుగాంచాడు. రోహిత్, విరాట్ టీ20 నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత, అతను అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు, అతని ఐపీఎల్ కెప్టెన్సీ కారణంగా అతని ఆదాయం గణనీయంగా పెరిగింది.

### బట్లర్, బుమ్రాలకు భారీ డిమాండ్..

ఇంగ్లాండ్ కు చెందిన విధ్వంసక బ్యాట్స్ మాన్ జోస్ బట్లర్ ప్రపంచంలోనే మూడవ అత్యంత ధనవంతుడైన క్రికెటర్. గుజరాత్ జెయింట్స్ అతనికి ఐపీఎల్ లో రూ.15.75 కోట్లు చెల్లిస్తుంది. అతని ప్రపంచ మార్కెట్ విలువ చాలా ఎక్కువ. ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకరిగా పరిగణించబడే జస్ప్రీత్ బుమ్రా బీసీసీఐ ఏ-కేటగిరీ ఆటగాడు. బుమ్రా ప్రధాన ఆదాయ వనరు అతని ఐపీఎల్ కాంట్రాక్టులు, ప్రధాన బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు.

### డి కాక్, సూర్యకుమార్ కూడా..

దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ క్వింటన్ డి కాక్ రిటైర్మెంట్ నుంచి బయటకు వచ్చి ఈ ప్రపంచ కప్ లో ఆడుతున్నాడు. ఐపిఎల్, ఇతర లీగ్ లలో అతని నిరంతర భాగస్వామ్యం గణనీయమైన ఆర్థిక లాభాలను తెచ్చిపెట్టింది. భారత ప్రస్తుత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆదాయంలో డి కాక్ తో పోల్చదగినవాడు. అతను ఇప్పుడు ప్రపంచ క్రికెట్ లో అతిపెద్ద వాణిజ్య బ్రాండ్లలో ఒకడు, ముంబై ఇండియన్స్ నుంచి రూ. 16.35 కోట్లు అందుకుంటున్నాడు.

### లిస్ట్‌లో ఫినిషర్లకు కూడా..

యువ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ తన దూకుడు బ్యాటింగ్, ఐపీఎల్ విజయంతో తక్కువ సమయంలోనే గణనీయమైన సంపదను సంపాదించాడు. ఈ ఎలైట్ జాబితాలో ఉన్న ఏకైక మలయాళీ ఆటగాడు సంజు సామ్సన్. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ ఒక పెద్ద ట్రేడ్‌లో కొనుగోలు చేసిన సంజు ఐపీఎల్ జీతం రూ.18 కోట్లు సంపాదిస్తాడు. బలమైన అభిమానుల మద్దతు, బ్రాండ్ విలువ అతన్ని ఈ జాబితాలో ఉంచుతాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫినిషర్లలో ఒకరైన టిమ్ డేవిడ్, వివిధ దేశాలలో టీ20 లీగ్‌లలో ఆడటం ద్వారా తన సంపదను గణనీయంగా పెంచుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ జాబితాలో పదవ స్థానంలో ఉన్నాడు. మైదానంలో అతని స్థిరమైన ప్రదర్శనలు, ఫ్రాంచైజ్ క్రికెట్‌లో అతని అధిక డిమాండ్ అతన్ని ఆర్థికంగా అగ్రస్థానంలో నిలిపాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com